

ఏడు గంగమ్మల పండుగ

శ్రీకాళహస్తిలో బుధవారం ఏడు గంగమ్మల జాతర వైభవంగా జరిగింది. ఏడు ప్రాంతాల్లోని అమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. రాత్రికి నిమజ్జనంతో జాతర ముగిసింది.

- 10లో

బుధవారం వేకువజామున వరుసగా వస్తున్న అమ్మవార్లు



పక్షుల పండుగ రెండు రోజులే..!

● ఇరకం, ఉబ్బలమడుగు సహ 7 ప్రాంతాల్లో నిర్వహణ

తడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట కేంద్రంగా ఏటా మూడు రోజుల పాటు అట్టహాసంగా జరిపే పక్షుల పండుగ ఈసారి రెండు రోజులే నిర్వహించనున్నట్లు సమాచారం. 2000 నుంచి ఏటా మూడు రోజుల పాటు పక్షుల పండుగ నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది సైతం పాత పద్ధతినే కొనసాగించారు. అయితే వచ్చే ఏడాది జనవరి 10, 11 లేదా 17, 18 తేదీల్లో పక్షుల పండుగ నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. అంటే రెండు రోజులే నిర్వహించనున్నారు. గత వారం కలెక్టరేట్‌లో జరిగిన సన్నాహక సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇందుకోసం సుమారు రూ.3 కోట్లు ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. గతేడాది సూళ్లూరుపేట, నేలపట్టు, అటకానితిప్ప, భీములవారిపాళెం, శ్రీసిటీలో పక్షుల పండుగ జరపగా, ఈ దఫా ఇరకందీవి, వరదయపాళెం మండలంలోని ఉబ్బలమడుగు జలపాతం వద్ద కూడా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇరకందీవిలో కాట్ ఎయిర్ బెలూన్, ఏరో స్పోర్ట్స్, ఉబ్బలమడుగులో ట్రెకింగ్, జలపాతాల వీక్షణ తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలుస్తోంది. కాగా, పక్షుల పండుగకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.



పరకామణి దొంగకు మరో రూలా?

మద్రాస్‌లో ఒక స్కూల్ ప్రిన్సిపాల్ రూ.1500 లంచం తీసుకున్నాడని సుప్రీంకోర్టు నాలుగు రోజుల కిందట రెండేళ్ల జైలు శిక్ష విధించింది. హెడ్మాస్టర్‌కి ఒక రూలా, పరకామణి దొంగకి ఒక రూలా? మాజీ ముఖ్యమంత్రికి ఒక రూలూ, బడిపంతులకు మరొక రూలా? ఏమిటిది? టీటీడీలో ఎన్నో అవకతవకలు జరుగుతున్నాయి. వైకుంఠ ఏకాదశికి కాంగ్రెస్ ప్రభుత్వంలో స్థానికులకు ప్రత్యేక దర్శనాలు కల్పించాం. కూటమి ప్రభుత్వంలో ఇవ్వడం లేదు. టీటీడీ ప్రతిష్ఠ పెంచింది స్థానికులు. అయినా స్థానికులకు ప్రాధాన్యం లేదు.

- చింతా మోహన్, కేంద్ర మాజీ మంత్రి, తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో

56,710


● ఇంకా పంపిణీ కాని స్మార్టు రేషన్‌కార్డులు

● తీసుకోవడానికి గడువిక ఐదు రోజులే

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 56,710 స్మార్టు రేషన్ కార్డులు పంపిణీ కాకుండా మిగిలిపోయాయి. ఆయా లబ్ధిదారులు ఈ కార్డులు పొందాలంటే.. ఐదు రోజులే గడువు ఉంది. పౌర సరఫరాల శాఖలో కూటమి ప్రభుత్వం నూతన సంస్కరణలు తీసుకొస్తోంది. ఇందులో భాగంగా పాత రేషన్ కార్డుల స్థానంలో కొత్త స్మార్ట్ కార్డులు తీసుకొచ్చింది. క్యూఆర్ కోడ్‌తో కూడిన ఈ కార్డులను ఆగస్టు నుంచి పంపిణీ చేస్తుండగా, ఇంకా 56,710 మంది తీసుకోలేదు. వీరిలో చాలా మందికి ఫోన్లు చేసి చెబుతున్నా రావడం లేదని అధికారులు అంటున్నారు. వృద్ధులు, దివ్యాంగులకు మాత్రం రేషన్ డీలర్లు, సచివాలయ ఉద్యోగులు ఇళ్లకెళ్లి ఇస్తున్నారు. కాగా, ఇప్పటికీ స్మార్ట్ కార్డులను తీసుకోని వారికి ప్రభుత్వం ఈనెల 15 వరకు గడువు విధించింది. ఆ తర్వాత రూ.200 చెల్లించి చిరునామాతో సహా దరఖాస్తు చేసుకోవాలి. అప్పుడు కమిషనరేట్ నుంచి నేరుగా లబ్ధిదారుల చిరునామాకు స్మార్ట్ కార్డు పంపుతారు. ఇలా మిగిలిపోయిన స్మార్టు కార్డుల్లో అనర్హులవి ఎక్కువగా ఉన్నట్లు సమాచారం.

జిల్లాలో పలువురు తహసీల్దార్ల బదిలీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ బుధవారం రాత్రి కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాళహస్తి తహసీల్దార్ జనార్దన్ రాజును తిరుపతి రూరల్ మండలానికి.. అక్కడ పనిచేస్తున్న రామాంజులు నాయక్‌కు కలెక్టరేట్ ఏవోగా పోస్టింగ్ ఇచ్చారు. ఏవో రమేష్ బాబును కలెక్టరేట్‌లోని ఇతర విభాగానికి బదిలీ చేశారు. కలెక్టరేట్ ఇ-సెక్షన్‌లో పనిచేస్తున్న లక్ష్మీనారాయణను బీఎన్‌కండ్రిగకు.. అక్కడి తహసీల్దారు శ్రీదేవిని సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయానికి అటాచ్ చేశారు. శ్రీకాళహస్తి తహసీల్దార్‌ను రెండుమూడు రోజుల్లో నియమించనున్నారు.



ఫైళ్ల క్లియరెన్సులో చకచకా

గరిష్ఠంగా రెండున్నర రోజుల్లో క్లియర్

కలెక్టర్, జేసీ వద్ద జీరో పెండింగ్

తిరుపతి కలెక్టరేట్‌లో ఇ-ఆఫీసు ఫైళ్ల క్లియరెన్సు వేగంగా జరుగుతోంది. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల వద్ద ఆరు నెలల కాలంలో పెండింగు పడిన ఫైళ్ల సంఖ్య సున్నా. కలెక్టర్ వద్దకు వస్తున్న ఫైళ్లను క్లియర్ చేయడంలో కనిష్ఠంగా ఒకటిన్నర రోజు నుంచీ గరిష్ఠంగా రెండున్నర రోజుల వ్యవధి తీసుకుంటున్నారు. ఫైళ్ల క్లియరెన్సులో మంత్రులు, సెక్రటరీలు (ఐఏఎస్), సెక్రటరియేట్ డిపార్ట్‌మెంట్ వారీగా, హెచ్‌వోడీస్‌లతో పాటు కలెక్టర్, జేసీలు ఏ స్థానంలో ఉన్నారో ప్రభుత్వం బుధవారం ప్రకటించింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

గత మూడు నెలలు, ఐదు నెలల వ్యవధిలో రెండు దశలుగా ఫైళ్ల క్లియరెన్సు తీరును ప్రభుత్వం పరిశీలించింది. జిల్లాకు సంబంధించి గత సెప్టెంబరు 9వ తేదీ నుంచీ ఈనెల 9వ తేదీ వరకూ మూడు నెలల కాలంలో కలెక్టర్ వద్దకు 843 ఫైళ్లు రాగా వాటిలో 740 క్లియర్ అయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉండగా, ఒక్క ఫైలు కూడా పెండింగులో లేదు. ఈ ఫైళ్ళను క్లియర్ చేయడానికి సగటున కలెక్టర్ తీసుకున్న వ్యవధి 44 గంటల 16 నిమిషాలు. గత జూలై 15వ తేదీ నుంచీ ఇప్పటి దాకా ఐదు నెలల కాలంలో అయితే కలెక్టర్‌కు 3704 ఫైళ్లు వచ్చాయి. వీటిలో 3616 ఫైళ్లను క్లియర్ చేయగా మిగిలినవి వేర్వేరు దశల్లో వున్నాయి. ఈ వ్యవధిలో కూడా ఫైళ్ల పెండింగు జీరో. కాగా ఫైళ్ల క్లియరెన్స్‌కు కలెక్టర్ సగటున తీసుకున్న వ్యవధి 57 గంటలు. కలెక్టర్‌కు పరిశ్రమలు, పర్యాటకం, ఇరిగేషన్, రోడ్డు ప్రాజెక్టులు, రైల్వే ప్రాజెక్టులు సహా అనేక శాఖలకు చెందిన కీలక ఫైళ్లు వస్తుంటాయి. ఇతర జిల్లాలతో పోలిస్తే తిరుపతి జిల్లాలో ఈ తరహా ఫైళ్లు కలెక్టర్ వద్దకు ఎక్కువ సంఖ్యలో వస్తుంటాయి. దానికి ఇక్కడి కలెక్టర్‌కు ప్రొటోకాల్ విధుల కోసం రోజులో అధిక సమయం కేటాయించే పరిస్థితి. అంత ఒత్తిడిలోనూ ఫైళ్ళ క్లియరెన్సు వేగంగా చేస్తుండడం గమనార్హం.

జేసీ వద్దా అదే స్పీడ్ : ఇక జాయింట్ కలెక్టర్ విషయానికి వస్తే గత మూడు నెలల్లో 110 ఫైళ్లు వచ్చాయి. వాటిలో 102 ఫైళ్లను క్లియర్ చేశారు. మిగిలినవి వివిధ దశల్లో వున్నాయి. జేసీ వద్ద ఫైళ్ల పెండింగ్ జీరో. అలాగే ఫైళ్ళు క్లియర్ చేయడానికి జేసీ తీసుకుంటున్న సగటు వ్యవధి 24 గంటల 11 నిమిషాలు. సాధారణంగా జేసీ వద్దకు భూసేకరణ, 22ఏ జాబితాకు సంబంధించిన భూముల ఫైళ్లు ఎక్కువగా వస్తాయి. ఇతర శాఖల నుంచీ వచ్చే ఫైళ్లు దాదాపుగా ఏమీ వుండవు. మొత్తమ్మీద జిల్లాలో ఇ-ఆఫీసు ఫైళ్ల క్లియరెన్సు త్వరితగతిన జరుగుతున్నట్టు ప్రభుత్వ నివేదిక స్పష్టం చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేసి వెల్లడించిన ఈ తరహా నివేదికల వల్ల ఇ-ఆఫీసు ఫైళ్ల క్లియరెన్సు మరింత వేగంగా జరిగే అవకాశముందని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అభిప్రాయపడ్డారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

● భారత రాజ్యాంగానికి ముప్పు

● ఓటు తొలగింపుతో రాజకీయ నరమేధం

● పౌర చైతన్యవేదిక సదస్సులో పరకాల ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రస్తుతం చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందనే అభిప్రాయాన్ని ప్రముఖ ఆర్థికవేత్త, విశ్లేషకుడు పరకాల ప్రభాకర్ వ్యక్తం చేశారు. రాజ్యాంగానికి ముప్పు పొంచి ఉందని వ్యాఖ్యానించారు. తిరుపతి అఫీసర్స్ క్లబ్‌లో మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా పౌర చైతన్య వేదిక రాష్ట్ర తొలి సదస్సులో బుధవారం ఆయన మాట్లాడారు. 'రెండున్నరేళ్లుగా మణిపూర్ అట్టుడికిపోతోంది. చాలా మంది ప్రాణాలు కోల్పోగా మహిళలను నగ్నంగా ఊరేగించిన సంఘటనలు వెలుగుచూశాయి. ఇక దేశ ప్రధాన న్యాయస్థానంలో జడ్జిపై చెప్పు విసిరిన సంఘటన జరిగింది. అయినా దేశంలో స్పందన కరువైంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, పార్లమెంటులో ఆరు దశాబ్దాల కిందటి వందేమాతరం అంశం మీద మాత్రం పది గంటలు చర్చ జరిగిందని విమర్శించారు. ఎస్‌ఐఆర్ గురించి మాట్లాడుతూ, 'ఒకప్పుడు ప్రభుత్వాన్ని ఓటరు ఎన్నుకునేవారు. ఇప్పుడు ప్రభుత్వం ఓటరుగా ఎవరుండాలో ఎన్నుకుంటోంది' అన్నారు. తమ అనుకూలతల కోసం ఓటును తొలగించడం రక్తపాతంలేని రాజకీయ నరమేధంగా అభివర్ణించారు. ఇలా మాట్లాడే అవకాశం ఎప్పటికీ ఇలానే ఉంటుందన్న నమ్మకం కనిపించడం లేదన్నారు. ఏ క్షణమైనా లోపలకు వెళ్లిపోవచ్చు.. ఈ సభలకు వచ్చివారిలో కొంత మందికి కూడా ఆ పరిస్థితి రావచ్చేమోననే సందేహాన్ని పరకాల ప్రభాకర్ వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులపై పౌరులంతా కార్యరంగంలోకి రావాలి, లేకపోతే మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. సెంటర్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమోక్రటిక్ రైట్స్ అండ్ సెక్యులరిజం(సీపీడీఆర్‌ఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి కుంచె శ్రీధర్ మాట్లాడుతూ చొరబాబుదారులను ఏరివేయడానికి స్పెషల్ ఇంటెన్సిప్ రివిజన్(ఎస్‌ఐఆర్) ఏర్పాటు చేశామని చెబుతున్న ఎలక్షన్ కమిషన్‌కు ఎవరు పౌరులో, ఎవరు కాదో తేల్చే బాధ్యత ఎవరిచ్చారని ప్రశ్నించారు. తప్పులపైన తప్పులు చేస్తూ ఎలక్షన్ కమిషన్ మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందన్నారు. పౌర చైతన్య వేదిక విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు ప్రొఫెసర్ కోలవెను చాంద్ ఎస్‌ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలని, కర్నూలు జిల్లా అధ్యక్షులు ఓంకార్ వివాదాస్పద కార్మిక చట్టాలను వ్యతిరేకిస్తూ, తిరుపతి జిల్లా కార్యదర్శి ఏఎస్.పరమేశ్వరరావు పెగాసెస్ వైరస్‌ను పోలిన సంచార సాధి యాప్‌ను వ్యతిరేకిస్తూ ప్రవేశపెట్టిన తీర్మానాలను సదస్సులో ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో పౌర చైతన్య వేదిక సభ్యులు, మేధావులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆ బాంబులు ఎప్పుడైనా పేలొచ్చు

● వ్యవసాయ కళాశాలకు మెయిల్.. ఇది నాలుగోసారి

● ఉత్తుత్తిదేనని తేల్చిన పోలీసులు



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):'వాష్‌రూములో ఏడు ఆర్డీఎక్స్ ఆధారిత పేలుడు పదార్థాలు పెట్టాం. అవి ఏ సమయంలోనైనా పేలొచ్చు' అంటూ తిరుపతిలోని వ్యవసాయ కళాశాలకు బుధవారం ఈమెయిల్ వచ్చింది. భయాందోళనకు గురైన అధికారులు వెంటనే తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందుకు సమాచారమిచ్చారు. పోలీసులు, డాగ్, బాంబు స్క్వాడ్‌లు కళాశాలలోని ప్రిన్సిపల్ సహా అన్నిచాంబర్లు, గదులు, హాస్టళ్లు, చుట్టు పక్కల ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఎక్కడా బాంబులు లేవని, ఫేక్ మెయిల్స్ అని తేల్చారు. కాగా, వ్యవసాయ కళాశాలకే బాంబు బెదిరింపు మెయిల్స్ రావడం ఇది నాలుగోసారి.తొలుత గతేడాది నవంబరు 17న, డిసెంబరు 18న, ఈ ఏడాది మే 28న, ఇప్పుడు తాజాగా.. వ్యవసాయ కళాశాలకు బెదిరింపులు రావడం గమనార్హం.

అప్పుడు క్రిస్టియన్.. ఇప్పుడు ఎస్సీ!

● పదవి కోసం మున్సిపల్ చైర్మన్ కుల ధ్రువీకరణలో మార్పులు

పుత్తూరు అర్బన్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): పదవుల కోసం నిబంధనలకు విరుద్ధంగా కుల ధ్రువీకరణ మార్చుకున్న ఘటన పుత్తూరు మున్సిపాలిటీలో వెలుగు చూసింది. ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి గతంలో క్రిస్టియన్‌గా కుల ధ్రువీకరణ పొంది మున్సిపల్ కౌన్సిల్ కోఆప్షన్ సభ్యుడిగా నియమితులయ్యారు. గత ప్రభుత్వంలో మున్సిపల్ చైర్మన్ పదవి ఎస్సీకి రిజర్వు కాగా, ఎస్సీ ధ్రువీకరణ పత్రాన్ని పొంది చైర్మన్ అయ్యారు. దీనిపై కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఫిర్యాదు వెళ్లడంతో విచారణకు ఆదేశించారు. క్రిస్టియన్‌గా జారీ చేసిన ధ్రువీకరణ పత్రం, తిరిగి ఎస్సీ ధ్రువీకరణ పత్రం జారీలో నిబంధనలు పాటించలేదని పుత్తూరు తహసీల్దార్ కలెక్టర్‌కు నివేదిక సమర్పించినట్లు తెలిసింది. ఈ నివేదిక మేరకు మున్సిపల్ చైర్మన్ పదవి నుంచి తొలగించాలని కలెక్టర్ పురపాలక శాఖ ఉన్నతాధికారులకు నివేదించినట్లు సమాచారం. మున్సిపల్ అధికారులకూ సమాచారం అందించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆయన పదవి కూడా కోల్పోయే పరిఅనంతరం ఆయన పదవి కూడా కోల్పోయే పరిస్థితి నెలకొంది.

అక్కడ మిస్సింగ్.. ఇక్కడ హత్య

చంద్రగిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెలో మిస్సింగ్ అయిన వ్యక్తి.. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురంలో హత్యకు గురయ్యారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. మదనపల్లె రూరల్‌కు చెందిన ఆవుల నరసిహులు, నాగరాజు, కత్తి నరసింహులు, నారాయణస్వామి.. చంద్రగిరి మండలం నరసింగాపురానికి చెందిన మునిరాజ స్నేహితులు. వీళ్లు తాంత్రిక వైద్యం, గుప్త నిధులు తవ్వకాలు చేస్తుంటారు. అయితే ఆవుల నరసింహులు.. తన భార్యతో సన్నిహితంగా ఉండటంపై నాగరాజు ఆగ్రహించాడు. ముందస్తు పథకం ప్రకారం అక్టోబరు 27వ తేదీన చంద్రగిరిలో తాంత్రిక వైద్యం చేయాలని ఆవుల నరసింహులు, నారాయణస్వామి, కత్తి నరసింహులను మదనపల్లెలో బస్సు ఎక్కించి పంపించాడు. వాళ్లకు తెలియకుండా వెనక మరో బస్సు ఎక్కి శ్రీనివాసమంగాపురంలో నాగరాజు దిగాడు. నరసింగాపురంలోని మునిరాజకు ఫోన్ చేసి ద్విచక్ర వాహనం తీసుకురమ్మని చెప్పాడు. అనంతరం ఆవుల నరసింహులు ఒక్కడినే శ్రీనివాసమంగాపురానికి పిలిపించారు. ద్విచక్ర వాహనంలో అతడిని ఎక్కించుకుని.. మామిడి తోపులోకి నాగరాజు, మునిరాజ తీసుకెళ్లారు. అక్కడ హత్య చేసి, పూడ్చి వేశారు.ఆవుల నరసింహులు కనిపించడంలేదని మదనపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా స్నేహితులనూ విచారించగా.. నాగరాజ, మునిరాజు హత్య చేసినట్లు తెలిసింది. దీంతో మదనపల్లె పోలీసులు గురువారం నిందితులను తీసుకొచ్చి మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

వైభవంగా గంగమ్మ జాతర



గంగమ్మకు సారె తీసుకొస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం ఐతేపల్లె గ్రామంలో గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి గ్రామస్తులు సమీపంలోని స్వర్ణముఖి నదిలో బంకమట్టి తీసుకొచ్చి గంగమ్మ ప్రతిమను తయారు చేసి విశేషంగా అలంకరించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త ఏవీ రమణ మూర్తి, మాజీ జడ్పీటీసీ సరిత దంపతుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే పులివర్తి నాని అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించి దర్శించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, ఎంపీటీసీ శేఖర్, టీడీపీ నాయకులు రమేష్‌రెడ్డి, అగరాల జయచంద్రారెడ్డి, విశ్వనాథం, వెంకటముని, లోకాద్రినాయుడు, ఉస్మాన్, లతీష్ తదితరులు పాల్గొన్నారు.

మానవహక్కులు అందరూ తెలుసుకోవాలి



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి పూర్ణిమదేవి

పాకాల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మానవహక్కులు, ప్రాథమిక హక్కుల గురించి అందరూ తెలుసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి పి.పూర్ణిమదేవి కోరారు. మానవహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు జడ్జి అధ్యక్షతన నిర్వహించారు. మానవహక్కులు, ప్రాథమిక హక్కుల గురించి వివరించారు. లోక్ అదాలత్ తీర్పు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని, కక్షదారులు కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని కోరారు. వివిధ చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జి.గురుస్వామినాయుడు, ఎస్ఎన్ఎం సలీం, జెఎం గౌరీశంకరరాజు, ఏజీపీ మురళి, చంద్రమోహన్, ఎన్. ప్రవీణ్ ప్రకాష్, సాయి, ప్రిన్సిపాల్ రెడ్డిరామరాజు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

'వైసీపీ విద్యార్థి సంఘ అధ్యక్షుడిది అక్రమ అరెస్టు'

తిరుపతి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ విద్యార్థి సంఘ అధ్యక్షుడు చైతన్యది అక్రమ అరెస్టు అని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి ఆరోపించారు. తుమ్మలగుంటలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలని అడిగితే పోలీసులతో పిడిగుద్దులు, అక్రమ అరెస్టులు చేయిస్తున్నారని ఆరోపించారు. చంద్రగిరి విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెంగల్‌రెడ్డి, ఎస్వీయూ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, వివిధ మండలాల అధ్యక్షులు వినోద్‌కుమార్, యశ్వంత్‌రెడ్డి, శేషారెడ్డి, ముని తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నివారిద్దాం, పర్యావరణాన్ని కాపాడుకుందాం



కుమ్మరపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

భాకరాపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను నివారిద్దాం అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విశ్వనాథ నాయక్ అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా చిన్నగొట్టిగల్లు మండలం కుమ్మరపల్లెలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పరిసరాలు, గ్రామ వీధుల్లో ఉన్న ప్లాస్టిక్ పేపర్లు, కవర్లు, చెత్తాచెదారాన్ని బుధవారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వలన కలిగే నష్టాలను వివరిస్తూ గ్రామంలోని వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి రవీంద్ర, రోహి సంస్థ అధ్యక్షుడు సహదేవయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బీజేపీ యువనేత పృథ్వీరెడ్డి

భాకరాపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని బీజేపీ యువనేత పృథ్వీరెడ్డి అన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంటును బుధవారం చిన్నగొట్టిగల్లు మండలం ఎగవూరు పంచాయతీ బొగ్గలవారిపల్లె వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడల్లో గెలిచిన వారికి మొదటి బహుమతిగా రూ.30 వేలు, రెండవ బహుమతిగా రూ.15 వేలు, మూడవ బహుమతిగా రూ.5 వేలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు ఎంపీపీగా పూజారి ఆదిలక్ష్మి?

ఏర్పేడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు ఎంపీపీగా పంగూరు ఎంపీటీసీ సభ్యు రాలు పూజారి ఆదిలక్ష్మి ఎంపికకానున్నారు. ఏర్పేడు ఎంపీపీగా ఉన్న పల్లం ఎంపీటీసీ సభ్యురాలు గీత రాజీనామాతో వైస్ఎంపీపీగా ఉన్న శ్రీనివాసులుయాదవ్‌ను జిల్లా అధికారుల ఆదేశాలతో ఎంపీపీగా ఎన్ను కున్నారు. అయితే ఏర్పేడు ఎంపీపీ స్థానం ఎస్టీ మహిళకు కేటాయించడంతో ఎమ్మెల్యే సుధీర్ సూచనల మేరక జిల్లా అధికారులు పంగూరు ఎంపీటీసీ సభ్యురాలిగా ఉన్న ఆదిలక్ష్మిని ఎంపీపీగా నియమించనున్నారు. ఈమేరకు గురువారం ఆమెను అధికారికంగా ఎంపిక చేసి జిల్లా అధి కారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో సౌభాగ్యం అధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేయించ నున్నట్లు తెలుస్తోంది.

ఎమ్మెల్యే చొరవతో జోరుగా తారురోడ్డు పనులు



రామచంద్రాపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో రాయలచెరువు నుంచి 11 కిలోమీటర్ల దూరంలోని కట్టనూతిగుంటపల్లె వరకు జోరుగా తారురోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణం 1997లో చేపట్టారు. దాని తరువాత రెండు దఫాలుమాత్రమే ప్యాచ్‌వర్క్ చేశారు. గత ఏడేళ్లుగా అలాగే వదిలేయడంతో పెద్దపెద్దగుంతలు ఏర్పడి ప్రయాణం సాగని పరిస్థితి ఏర్పడింది. ఈ రోడ్డు విషయమై ఎన్నికల ముందు ఎమ్మెల్యే నాని ప్రజలకు హామీ ఇచ్చారు. గత పది రోజులోగా రూ.1.30కోట్లతో తారురోడ్డు పనులు జరుగుతున్నాయి. మరోనాలుగురోజుల్లో పనులు పూర్తికానున్నాయి. త్వరలో రూ.2కోట్లతో డబుల్‌రోడ్డు పనులు జరుగనున్నాయి. ఈ సందర్భంగా సదరు గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే నానీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

వేదాంతపురంలో రహదారులకు మహర్దశ

- రూ.2.24కోట్లతో 3,300మీటర్లమేర సీసీరోడ్లకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న పరంధామయాదవ్, శ్యాంబాబు తదితరులు

తిరుపతి రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వేదాంతపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పలుకాలనీల్లో సరైన రోడ్డు సదుపాయం లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్ల దుస్థితిపై స్థానిక టీడీపీ నేతలు, ప్రజలు ఎమ్మెల్యే పులివర్తి నానీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన పంచాయతీ పరిధిలో రూ.2.24కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో దాదాపు 3,300మీటర్ల మేర సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. గ్రామంలోని కొండేళ్లకాలనీ, స్కందబేకరీ-చెంచులక్ష్మికాలనీ, వృద్ధాశ్రమం, సీపీఆర్ విల్లాస్ ప్రహరీని ఆనుకుని మార్క్ కాలనీవరకు ఈనిధులతో సీసీ రోడ్లు నిర్మించనున్నారు. పలువురు గ్రామస్తులు సంతోషం వ్యక్తపరుస్తున్నారు. ఈమేరకు బుధవారం టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు చెరుకుల పరంధామయాదవ్, నేతలు శ్యాంబాబు, చంద్రా ముదిరాజ్, చిరంజీవిరెడ్డి నేతృత్వంలో సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా సరైన రోడ్లులేక అవస్థలు పడుతున్నామని, గత ప్రభుత్వంలో పలుమార్లు విన్నవించినా అప్పటి పాలకులు పట్టించుకోలేదని వాపోయారు. చొరవచూపిన ఎమ్మెల్యే నానికి రుణపడి ఉంటామన్నారు. పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, కాంట్రాక్టర్ ఎం.మోహన్‌బాబు, స్థానిక టీడీపీనేతలు రవిరెడ్డి, ప్రసాద్, సాయి, శంకర్, డి.సాయి, నవీన్, గౌతమి, రఘురామ్‌రెడ్డి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు

ఘనంగా పాచికాల్వ గంగమ్మ జాతర



సారెను తీసుకెళుతున్న కూటమి నేతలు



విశేష అలంకరణలో పాచికాల్వ గంగమ్మ

తిరుమల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల గ్రామదేవత పాచికాల్వ గంగమ్మ జాతర బుధవారం వైభవంగా జరిగిది. ఏటా తిరుమలలో స్థానికులు అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించడం ఆనాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. ఇక, బుధవారం ఉదయం సాయంత్రం దీపారాధన ఊరేగింపును కనులపండువగా నిర్వహించారు. అమ్మవారి జాతర సందర్భంగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కూటమి నేతలు సుగుణమ్మ, భానుప్రకాష్‌రెడ్డి, నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ పట్టువస్త్రాలు, సారెను బాలాజీనగర్‌లోని వినాయకస్వామి ఆలయం నుంచి అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపుగా తీసువెళ్లారు. ఊరేగింపులో పులిగోరు మురళి, అన్న రామచంద్రయాదవ్, దంపూరి భాస్కర్ యాదవ్, శ్రీధర్‌వర్మ, రాజుయాదవ్, కేశవులు, శివషణ్ముగం, పగడాల మురళి, రమణ, జీవన్ రాయల్, శరత్‌యాదవ్, మంజు, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

బిర్యానీకోసం వెళ్లేందుకు..!

- హాస్టల్ మూడో అంతస్తు నుంచి పైపు పట్టుకుని దిగిన విద్యార్థులు
- కిందపడటంతో ఒకరికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న మహీధర్‌రెడ్డి

చంద్రగిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాళ్లంతా కళాశాల, హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. బిర్యానీ తినేందుకని మూడో అంతస్తు నుంచి పైపులు పట్టుకుని కిందకు దిగుతున్నారు. ఈ క్రమంలో ఒకరు కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. ఇతడి పరిస్థితి విషమంగా ఉంది. చంద్రగిరి పోలీసులు తెలిపిన ప్రకారం.. అన్నమయ్య జిల్లా కలికిరికి చెందిన మహీధర్ రెడ్డి, చంద్రగిరి మండలంలోని ఓ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అర్ధరాత్రి బిర్యానీ తినాలని అతడితో పాటు మరికొందరు కలిసి మంగళవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో నాలుగు అంతస్థుల భవనంపై నుంచి శానిటరీ పైపుల ద్వారా కిందకు దిగేందుకు యత్నించారు. ముందు ఒక విద్యార్థి క్షేమంగా దిగాడు. ఆ తర్వాత మహీంధర్‌రెడ్డి కిందకు దిగుతుండగా, మూడో అంతస్థు వద్ద జారడంతో కింద పడ్డాడు. అతడి తలకు తీవ్ర గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి జారుకున్నాడు. తోటి విద్యార్థులు కేకలు వేయడంతో కళాశాల సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. చికిత్స నిమిత్తం అతడిని రేణిగుంట సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని, ప్రమాద వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంట పొలాలపై గజదాడులు

మధురమలై కొండలో మకాం





ఎర్రమిట్ట వద్ద ఏనుగులు ధ్వంసం చేసిన పైపులు - తొక్కేసిన వరిపైరు

సోమల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో గజదాడులు కొనసాగుతున్నాయి. ఇరికిపెంట పంచాయతీ ఎర్రమిట్ట సమీపంలో మంగళవారం రాత్రి మూడు ఏనుగులు వరి పైరును తొక్కేసి, మామిడి తోటల్లో కొమ్మలను విరిచేశాయి. ఎర్రమిట్టకు చెందిన భాస్కర్ నాయుడు విద్యుత్ మోటర్, డ్రిప్ పైపులను ధ్వంసం చేశాయి. రెడ్డిబాబు, రెడ్డెప్ప నాయుడు, కృష్ణ, శేఖర్ వరి పొలంలో పంటను తిని, తొక్కేసి నష్టపరిచాయి. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు ఎఫ్‌బీవో రాధ పంటలను పరిశీలించి, నష్టాన్ని అంచనా వేశారు.

మధురమలై కొండ ఆవాసంగా..

మండలంలోని ఆవులపల్లె పంచాయతీ ఎగువకొత్తూరు, పత్రపల్లె వైపు నుంచి వచ్చిన ఏనుగులు మధురమలై కొండను ఆవాసంగా చేసుకుని పగలు కొండలో సంచరిస్తూ రాత్రి సమీప పొలాల వైపు వస్తున్నాయి. సోమవారం నెలుకూరివారిపల్లె సమీపంలో టమోటా, వరి పంటల్లో స్వైరవిహారం చేసి బోరు పైపులు, డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశాయి. మంగళవారం మధురమలై కొండ వద్ద సంచరించడంతో పశువులను మేతకు తీసుకెళ్లడానికి రైతులు ఇబ్బందిపడ్డారు. మంగళవారం రాత్రి ఎర్రమిట్ట వద్ద పంటలను ధ్వంసం చేశాయి. ఆ పొలాలను బుధవారం ఉదయం సోమల ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, చెన్నపట్నం చెరువు నీటి సంఘ అధ్యక్షుడు గల్లా బోస్, ఉపాధ్యక్షుడు గౌతం సందర్శించి, అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దాడులు చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పశువుల, మేకల, గొర్రెల కాపరులు అటువైపు వెళ్లరాదని అటవీ శాఖ అధికారులు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి



వెంకటేష్ (ఫైల్‌ఫొటో)

యాదమరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి చెందాడు. ఎస్‌ఐ ఈశ్వర్ వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం పరదరామి వరదరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గోపాల్ కుమారుడు వెంకటేష్ (37) యాదమరిలోని ఐవోసీఎల్ సంస్థలో లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి యాదమరి నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతున్నాడు. చిత్తూరు - గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారి నారాయణపురం వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. వెంకటేష్ తలకు తీవ్రగాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు డ్రైవర్ ఆత్మహత్య



రాజేష్ (ఫైల్‌ఫొటో)

యాదమరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మద్యానికి డబ్బులు ఇవ్వలేదనే కోపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పాచిగుంట గ్రామం లో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పాచిగుంట గ్రామానికి చెందిన రాము కుమారుడు రాజేష్ (27) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి అలవాటుపడిన అతను బుధవారం కుటుంబ సభ్యులను డబ్బులు అడిగాడు. నిరాకరించడంతో కోపంతో విషం తాగాడు. అపస్మారక స్థితికి చేరుకోవడంతో చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ



హెల్మెట్ ధరించాలని మానవహారం చేస్తున్న గీతాంజలి పాఠశాలల విద్యార్థులు

రామచంద్రాపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గీతాంజలి పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ జరిగింది. ఆర్సీపురం నాలుగు రోడ్ల కూడలిలో పిల్లలు హెల్మెట్ ధరించండి... ప్రాణాలు కాపాడుకోవాలని బుధవారం మానవహారం నిర్వహించారు. 300మంది విద్యార్థులు నినాదాలు చేశారు. అక్కడి నుంచి పిల్లలందరూ హెల్మెట్ ధరించి మిట్టూరు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చిన్నబాబు మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వలన తనతో పాటు ఇతరుల ప్రాణాలు కాపాడినవారవుతారన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని కోరారు. ఎస్ఐ భక్తవత్సలం మాట్లాడుతూ గీతాంజలి పాఠశాల యాజమాన్యం పిల్లల చేత హెల్మెట్ ధరింపజేసి వినూత్నంగా అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. ఈ నెల 15 నుంచి ట్రాఫిక్ నిబంధనలు విధిగా అందరూ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మాధవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూ మండల కమిటీ ఏర్పాటు







శ్రీరాములు, రెడ్డప్పరెడ్డి, సుబ్రహ్మణ్యం

భాకరాపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం ఎస్‌టీయూ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా టి.శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా ఎం.రెడ్డప్పరెడ్డి, కోశాధికారిగా డి.సుబ్రహ్మణ్యం, మహిళా కన్వీనర్‌గా సునీతను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ప్రకాశ్ కుమార్, చెంగల్‌రాయుడు ఆచారి, వెంకట కుమారి, కార్యవర్గసభ్యులుగా చంద్రశేఖర్ రాజు, పుష్పలత, విజయకమారి, ఆర్థిక కమిటీ సభ్యులుగా చంద్రకళ, గీత, సీపీఎస్ కన్వీనర్‌గా భారతి, కార్యవర్గసభ్యులుగా చంద్రకళ, శిరీష, తారకేశ్వర, ప్రభావతి, సదాశివరెడ్డి, అమరనాథరెడ్డి, కౌసర్, సలీమా, వసంత కుమారి, జిల్లా కౌన్సిలర్‌గా అమరనాథరెడ్డి ఎన్నికయ్యారు.

శారదా శిశుమందిర్‌కు క్రీడా పరికరాల వితరణ



డ్రాయింగ్ పోటీల విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధి హేమకిరణ్

తిరుపతి(విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేకాలనీలోని శ్రీ శారద శిశుమందిర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు హైదరాబాద్‌కు చెందిన పావులూరి చైత్ర ట్రస్ట్ ప్రతినిధి హేమకిరణ్ బుధవారం రూ.25 వేలు విలువైన ఇండోర్ గేమ్స్ సామగ్రిని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా హేమకిరణ్ మాట్లాడుతూ ట్రస్ట్ తరఫున పాఠశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. పాఠశాల కార్యదర్శి రవిశంకర్, ప్రొఫెసర్ ఎం. హేమంత్‌కుమార్, ట్రస్ట్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతిచెందిన లోకనాథ్

శాంతిపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలోని మఠం హెరిటేజ్ (ప్యాక్‌హౌస్) వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. స్థానికులు, పోలీ సుల వివరాల మేరకు.. వి.కోట మండలం దాసార్లపల్లె గ్రామానికి చెందిన లోకనాథ్(25) సొంత పని నిమిత్తం ద్విచక్ర వాహనం లో శాంతిపురానికి వెళుతున్నాడు. కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలోని మఠం హెరిటేజ్ (ప్యాక్‌హౌస్) వద్ద వి.కోట నుంచి కుప్పం వైపు వెళుతున్న వ్యాను వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో లోకనాథ్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో రాళ్లబూదు గూరు పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం వంద పడకల ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మేదరమిట్ట పేరు మార్చవద్దని వినతి



భానుప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

తిరుపతి అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుమలలో చారిత్రక ప్రదేశమైన మేదరమిట్ట పేరును మార్చవద్దని బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, దివాకర్‌రెడ్డిలకు మేదరసంఘం జిల్లా అధ్యక్షులు టి.నాగరాజు(శెట్టిపల్లి) వినతి పత్రం అందజేశారు, బుధవారం ఉదయం వారిరువురిని వేర్వేరుగా కలసి ఇటీవల సామాజిక మాధ్యమాలు, దినపత్రికల్లో మేదరమిట్ట పేరు మారుస్తారన్న ప్రతిపాదనలపై జోరుగా ప్రచారం జరుగుతోందని వాపోయారు. ఒకప్పట్లో ఆ ప్రాంతంలో మేదర కులాల ప్రజలు నివశించేవారని, శ్రీవారికి అవసరమయ్యే గంపలు, బుట్టలు, చాటలను తయారుచేసి అందిచేవారని, దాంతో ఆ సేవకు గుర్తింపుగా మేదరమిట్ట అని పేరు వచ్చిందని గుర్తుచేశారు. పేరు మార్పు చేయడం ద్వారా ఆలయ సేవల్లో మేదర కుల ప్రాముఖ్యతకు సంబంధించిన చారిత్రక ఆధారాలు మరుగునపడే ప్రమాదముందని సూచించారు. మరిన్ని అంశాలను వివరించి యథాతథంగా ఉంచాలని కోరారు. కొనసాగించడం ద్వారా స్థానిక కళలు, పర్యావరణహిత ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించినట్టు అవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ జి.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

రెనక్ట్స్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ



రెనక్ట్స్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

తిరుపతి అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏపీ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19నుంచి మూడు రోజుల పాటు విజయవాడ వేదికగా నిర్వహించనున్న రెనక్ట్స్ ఎక్స్‌పోకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. బుధవారం స్థానిక ఓ ప్రైవేట్ హోటల్లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య, టెక్నికల్ ఈఈ వాసవిలత, ఏపీ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.హేమకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తు ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకొని సోలార్ ఎనర్జీ వినియోగం పెరగడం తథ్యమన్నారు. ముఖ్యంగా గృహాలకు సోలార్ కనెక్షన్లను ప్రోత్సాహించాలన్నారు. తద్వారా పర్యావరణ సంరక్షణతో పాటు విద్యుత్ బిల్లుల భారం కూడా తగ్గుతుందన్నారు. రెనక్ట్స్ ఎక్స్‌పోలో అత్యాధునిక సాంకేతికత, సోలార్ పరికరాలు, పునరుత్పాదక శక్తి పరిష్కారాలు, పరిశ్రమలకు సంబంధించిన నవీన ఆవిష్కరణలు ప్రదర్శించబడుతాయన్నారు. కార్యక్రమంలో సభ్యులు బాబు నాయుడు, మణికండన్, చంద్రశేఖర్, శైలజ, తేజ కుమార్, సాంబశివరావు, రామ్మోహన్‌రావు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు అభినందనలు



అభినందన కార్యక్రమంలో పాల్గొన్న పరమహంస ఇళ్లైయా కోయిల్ కేల్వీఅప్పన్ గోవింద రామానుజ చిన్నజీయర్ స్వామిగాళ్, ఎంఈవో బాలాజీ తదితరులు

తిరుపతి(విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నీట్, జేఈఈ, ఏఎన్‌టీహెచ్ఈ, ఐవోక్యూఎం పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల ప్రత్యేక అభినందన కార్యక్రమం స్థానిక మహతి ఆడిటోరియంలో బుధవారం జరిగింది. కాష్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పరమహంస ఇళ్లైయా కోయిల్ కేల్వీఅప్పన్ గోవింద రామానుజ చిన్నజీయర్ స్వామిగాళ్ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అభిభాషణం చేస్తూ విద్యార్థులను ఆశీర్వదించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఆకాష్ ఇన్‌స్టిట్యూట్ ఇంజనీరింగ్ వింగ్ సౌత్ రీజినల్ కోఆర్డినేటర్ వెంకటేష్, సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ జేఈఈ, నీట్ ప్రిపరేషన్‌కు విద్యార్థి అనుసరించాల్సిన విధానాలు, బేసిక్స్ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని తిరుపతి అర్బన్ ఎంఈవో బాలాజీ, ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు శ్రీధర్ విద్యార్థులకు వివరించారు. అనంతరం ప్రతిభావంతులైన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జీఎస్ఆర్ మాగ్నెట్ పాఠశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, హెడ్‌మాస్టర్ మధుసూదన్‌రాజు, ఆకాష్ ఇన్‌స్టిట్యూట్ ఏరియా హెడ్ మోడెమ్ నరసింహులు, మేనేజర్లు సురేంద్ర, వాటికలి మహేష్, షేక్ షాహీన్, అడ్మిన్ చిరంజీవి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ సభ్యుడు శ్రీపతిబాబుకు సన్మానం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు శ్రీపతిబాబును ఘనంగా సన్మానించారు. ఎస్వీయూకు బుధవారం ఆయన వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనివర్సిటీలో తాను చదువుకున్నానని, ఇందువల్ల ఎంతో మంది మిత్రులున్నారని చెప్పారు. సామాన్య కార్యకర్తగా ఉన్న తనను ఎస్సీ కమిషన్ సభ్యుడిగా నియమించిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లకు ధన్యవాదాలు తెలిపారు. శ్రీపతిబాబును తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద గౌడ్, అధికార ప్రతినిధి రామ్మోహన్, కల్చరల్ కోఆర్డినేటర్ పత్తిపాటి వివేక్, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్ నాయుడు, గంగాధర్, పాల్గొన్నారు.

విశ్వం విద్యార్థుల ప్రతిభ



విజేతలుగా నిలిచిన విశ్వం విద్యార్థులతో ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, విశ్వచందన్‌రెడ్డి తదితరులు

తిరుపతి(విద్య), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలల విద్యార్థులకు ఎస్వీయూ నిర్వహించిన డ్రాయింగ్, వ్యాసరచన పోటీల్లో జీవకోన విశ్వం హైస్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని విశ్వం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. తమ విద్యార్థులు శ్రియ, మమత, రిక్షిత, జోయ్ జాస్మిన్ మొదటి బహుమతులు సాధించగా సంజన, దివ్యతేజ, పద్మిని, హారిక రెండవ బహుమతులను గెలుచుకుని ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారని చెప్పారు. విద్యతోపాటు విలువలకు ప్రాధాన్యం ఇచ్చే సమగ్ర విద్యను విశ్వం అందిస్తోందన్నారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ విశ్వచందన్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు.

గ్యాస్ బిల్లుకు మించి వసూలు చేస్తే చర్యలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): డెలివరీ బాయ్‌లు గ్యాస్ సిలిండర్‌ను వినియోగదారునికి ఇచ్చే క్రమంలో బిల్లు మొత్తానికి మించి వసూలు చేస్తే సదరు ఏజెన్సీలపై చర్యలు ఉంటాయని గ్యాస్ డీలర్లను ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ మౌర్య హెచ్చరించారు. నగరపాలకసంస్థ కార్యాలయంలో బుధవారం గ్యాస్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో గ్యాస్ డెలివరీ బాయ్స్ బిల్లు మొత్తానికన్నా ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని.. పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు ఉంటాయన్నారు. డెలివరీ బాయ్స్ నియమ నిబంధనలు పాటించేలా చూడాలని హెచ్చరించారు.

గంగమ్మ ఆలయ అభివృద్ధికి రూ.2.5కోట్లు

● సీఎంకు కృతజ్ఞతలు తెలిపి గుడికి ఆహ్వానించిన చైర్మన్



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న మహేష్ యాదవ్, రవినాయుడు

తిరుపతి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ.2.5 కోట్లు నిధులను మంజూరు చేశారని ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్ చెప్పారు. గంగమ్మ ఆలయానికి టీటీడీ కేటాయించిన రూ2.5 కోట్ల నిధులు ప్రభుత్వ అనుమతి కోసం పెండింగ్‌లో ఉందని, సీఎం ఆదేశాలతో మంజూరయ్యాయన్నారు. ఈ సందర్భంగా బుధవారం మంగళగిరిలో సీఎం చంద్రబాబును శాప్ చైర్మన్ రవి నాయుడుతో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో గంగమ్మ ఆలయ దర్శనానికి రావాలని సీఎంను చైర్మన్ ఆహ్వానించారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి నిధుల మంజూరుకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థినులకు భద్రత కల్పించండి

● సంస్కృత వర్సిటీ వీసీకి భానుప్రకాష్‌రెడ్డి విజ్ఞప్తి



వీసీ కృష్ణమూర్తితో సమావేశమైన భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో విద్యార్థినులకు తగిన రక్షణ కల్పించాలని టీటీడీ పాలకమండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆ వర్సిటీ వీసీ కృష్ణమూర్తిని బుధవారం కలిసి ఆయన సూచించారు. ఇటీవల ఎడ్యుకేషన్ విభాగంలో డిగ్రీ తొలి సంవత్సర విద్యార్థినిపై అసిస్టెంట్ ప్రొఫెసర్లు లైంగిక దాడికి పాల్పడటం సిగ్గుచేటన్నారు. ఇలాంటి ఘటనలు యూనివర్సిటీలో ఇంకా ఉంటే సమగ్రంగా విచారించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇంటిగ్రేటెడ్ లా కోర్సు డీన్ నియామకం



ప్రొఫెసర్ భాస్కరరెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ లా కోర్సు ఇన్‌చార్జి డీన్‌గా ప్రొఫెసర్ భాస్కరరెడ్డి నియమితులయ్యారు. ఆర్కియాలజీ విభాగాధిపతిగా, బీఓఎస్ చైర్మన్‌గా, హాస్టల్ వార్డెన్‌గా, వర్సిటీ ఆర్ట్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌గా పని చేశారు. ఈ క్రమంలో ఇంటిగ్రేటెడ్ లా కోర్సు డీన్‌గా నియమితులయ్యారు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఉదయ్ వంశీ తదితరులు

తిరుపతి(జీవకోన), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పరిధిలోని 26వ డివిజన్‌లో పీర్లచావిడి నుంచి ఎల్ అండ్‌బి హోటల్ వరకు స్థానిక ప్రజల వినతి మేరకు కార్పొరేటర్ కృషితో నూతన రోడ్డును మంజూరుచేశారు. బుధవారం భూమి పూజ నిర్వహించి రోడ్డు ప్రారంభోత్సవ పనులను ప్రారంభించారు. వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్ వంశీ ఈ పనులను పర్యవేక్షించారు. త్వరలో రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

వైద్యవిద్యపై రాజకీయం తగదు

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి



కోటి సంతకాల పత్రాలను కరుణాకరరెడ్డికి అందజేస్తున్న రోజా తదితరులు

తిరుపతి(జీవకోన), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్యపై రాజకీయం తగదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన కోటి సంతకాల సేకరణ పత్రాలను మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజాతో పాటు చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన నియోజకవర్గ సమన్వయకర్తలు బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో కరుణాకరరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీటిని గవర్నర్‌కు అందజేసి మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయడానికి అడ్డుకుంటామన్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్తలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రాలయంలోనూ టీటీడీ తరహా సౌకర్యాలు

● సుబుదేంద్రతీర్థ స్వామి

తిరుమల, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుమలలో సామాన్య భక్తుల కోసం ఇటీవల అందుబాటులోకి తీసుకువచ్చిన వేంకటాద్రి నిలయం(పీఏసీ-5) వసతి సముదాయాన్ని మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠాధిపతి సుబుదేంద్రతీర్థ స్వామి బుధవారం రాత్రి సందర్శించారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. భక్తులు సేదతీరే హాళ్లు, లాకర్లు, స్నానపు గదులు, మరుగుదొడ్లు, కల్యాణకట్ట వంటి వివిధ సౌకర్యాల గురించి అదనపు ఈవో వివరించారు. టీటీడీ చేస్తున్న ఏర్పాట్లు అనిర్వచనీయమని సుబుదేంద్రతీర్థ తెలిపారు. మంత్రాలయంలోనూ ఈ తరహా విధానాలను అమలు చేస్తామన్నారు. అనంతరం వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు.



పీఏసీ-5 వసతి సముదాయాన్ని పరిశీలిస్తున్న సుబుదేంద్రతీర్థ స్వామి

పన్ను ఎగవేతదారులకు రెడ్ నోటీస్‌లు

● అప్పటికీ చెల్లించకపోతే కుళాయి, డ్రైన్ కనెక్షన్ల కట్

● రెవెన్యూ అధికారుల సమీక్షలో కమిషనర్ మౌర్య



రెవెన్యూ సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో పన్ను ఎగవేతదారులకు, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పన్ను బకాయిదారులకు రెడ్ నోటీసులు ఇచ్చి వసూలు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.మౌర్య రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పన్నుల వసూళ్లు తదితర అంశాలపై బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సచివాలయ కార్యదర్శులతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా వార్డుల పరిధిలో పన్నుల వసూళ్లపై అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పలు వార్డుల్లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వాటిని గుర్తించి రెడ్ నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అప్పటికీ స్పందించని వారి కుళాయి, డ్రైనేజీ కనెక్షన్లు కట్ చేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు తమ వార్డుల పరిధిలో ఉన్న అన్నింటినీ తనిఖీ చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్తుల బకాయిలకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఆస్తి పన్నుతో పాటు అన్ని రకాల పన్నులు సకాలంలో వసూలు చేయాలని తెలిపారు. విధి నిర్వహణలో అందరూ సక్రమంగా ఉండాలని, ఎటువంటి సమస్యలు ఉన్నా పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని చెప్పారు. పన్నులు వసూళ్లలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, ఆర్ఐలు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించండి

● సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథరెడ్డి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ, రైతు సంఘం నాయకులు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, అప్పులు తీర్చలేక రైతుల ఆత్మహత్యలను నివారించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు పి.హరినాథరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట బుధవారం ఏపీ రైతు సంఘం నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు ప్రభుత్వమే గిట్టుబాటు ధరలు నిర్ణయించాలని కోరారు. మొంథా తుఫాన్ కారణంగా రూ.5,500 కోట్లకుపైగా నష్టం వాటిల్లిందన్నారు. అయితే ప్రభుత్వం రూ.1000 కోట్లు నష్టం వాటిల్లినట్లు నిర్ణయించడం దారుణమని మండి పడ్డారు. రైతులకు ఎంటనే పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేటర్లకు అప్పగించడానికి ప్రయత్నించడం అన్యాయమని విమర్శించారు. భూమిలేని కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఎస్వీయూలో ఘనంగా నిర్వహించారు. మానవ హక్కుల విభాగం ఆధ్వర్యంలో సెనేట్ హాల్లో బుధవారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో వీసీ నరసింగారావు, రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ప్రిన్సిపాల్ సుధారాణి తదితరులు పాల్గొని మాట్లాడారు. హక్కులు ప్రకృతి సిద్ధంగా ఏర్పడ్డాయన్నారు. ప్రతిఒక్కరూ హక్కుల గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. తోటి వారికి హక్కుల ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. ప్రతిభా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా కొత్త క్రీడా అకాడమీలు ఏర్పాటుచేయించండి

● సీఎంను కోరిన శాప్‌చైర్మన్

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణ పొందేందుకు రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా క్రీడా అకాడమీలు ఏర్పాటు చేయించాలని శాప్ చైర్మన్ రవినాయుడు ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. బుధవారం రాత్రి సీఎంను శాప్ చైర్మన్ మర్యాదపూర్వకంగా కలసి కొన్ని అంశాలపై వినతిపత్రం అందజేశారు. ఏపీని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో క్రీడారంగాభివృద్ధికి అవసరమైన అంశాలను వివరించారు. యువ క్రీడాకారుల ప్రోత్సాహకాలు త్వరితగతిన విడుదల చేయించాలని, క్రీడారంగంలో నైపుణ్యం పెంపొందించేందుకు అవసరమైన కోచ్‌ల నియమాకం తక్షణమే చేపట్టాలని, 1993-94, 1999లో నియమించిన కోచ్‌లకు పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కడప స్పోర్ట్స్ స్కూల్ టీచర్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుపతిలో స్పోర్ట్స్ సిటీ కోసం 28ఎకరాలు కేటాయించినందుకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు.

హలో బీసీ - ఛలో ఢిల్లీ గోడపత్రికల ఆవిష్కరణ



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

తిరుపతి అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఓ ప్రైవేటు హోటల్లో బుధవారం సాయంత్రం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హలో బీసీ - చలో ఢిల్లీ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15, 16తేదీల్లో ఢిల్లీలో మహాధర్నా, పార్లమెంటు ముట్టడి కార్యక్రమాలు తలపెట్టామన్నారు. ఓబీసీ సంఘాలన్నీ తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జనాభా దామాషా మేరకు రాజకీయ రిజర్వేషన్లతో పాటు మహిళా రిజర్వేషన్‌కు చట్టసవరణచేసి ఓబీసీ మహిళలకు సబ్‌కోటా కేటాయించాలని డిమాండ్ చేస్తూ వినతులను ప్రధాని మోదీకి, హోంమంత్రి అమిత్‌షాకు, కాంగ్రెస్ అగ్రనేతలకు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గేలతో పాటు పార్లమెంటు సభ్యులందరికీ అందజేస్తామన్నారు. స్థానిక సంస్థలకు బీసీల రిజర్వేషన్ల బిల్లులు ప్రకటించిన ప్రతిసారి న్యాయస్థానాలు 50శాతం పరిమితిమించి పోయిందంటూ చెల్లదంటూ కొట్టేస్తుండడంతో బీసీలకు చాలా అన్యాయం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలలోనే ఓబీసీల రాజకీయ రిజర్వేషన్ల బిల్లులను పాలక ప్రతిపక్షాలు ఆమోదించి చట్టం చేసిన తరువాతనే ఎన్నికలు జరిపేలా సామాజిక న్యాయానికి కట్టుబడాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్, ఇతర బీసీ నాయకులు ఆర్.కె.యాదవ్, లోకయ్య, నాగరాజగౌడ్, సోమశేఖర్‌ఆచారి, మధు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందనలు



క్రీడాకారుడు గణేష్‌ను అభినందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 10(ఆంధ్ర జ్యోతి): నాయుడుపేటకు చెందిన గణేష్ ఇటీవల జరిగిన ప్రపంచ ఆర్చరీ యూత్ చాంపియన్‌షిప్ బృందం బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా బుధవారం సదరు క్రీడాకారుడు గణేష్‌ను కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ సత్కరించి అభినందించారు.


భైరివారిమండపం.. ముత్యాలమ్మ


పెండ్లిమండపం.. పొన్నాలమ్మ


గాంధీవీధి.. అంకమ్మ


కొత్తపేట.. భువనేశ్వరి


బ్రాహ్మణవీధి.. నల్లగంగమ్మ




జయరామరావువీధి.. కావమ్మ


సన్నిధివీధి.. అంకాలమ్మ

కొలువుదీరిన ఏడు గంగమ్మలు

● రాత్రి ఘనంగా నిమజ్జనం

● రోజంతా మొక్కులు చెల్లించుకున్న భక్తులు

శ్రీకాళహస్తికే ప్రత్యేకమైన ఏడు గంగమ్మల జాతర బుధవారం ఘనంగా జరిగింది. అమ్మవారి నామస్మరణతో పట్టణం మార్మోగింది. అమ్మవార్లు కొలువుదీరే ఏడు ప్రాంతాల్లో మూడు రోజుల ముందు నుంచే చలువ పందిళ్లు, విద్యుద్దీపాలతో అలంకరించారు. ఏడు ప్రాంతాల్లో అమ్మవారి ఉత్సవమూర్తులు మంగళవారం అర్ధరాత్రిపైన విశేష అలంకారంలో ఊరేగింపునకు సిద్ధం చేశారు. బుధవారం వేకువజామున మూడు గంటల ప్రాంతంలో ఏడుగంగమ్మలు వరుసగా శ్రీకాళహస్తి న్యాయస్థాన భవనం సమీపంలోని ఏడుగంగమ్మల ఆలయం వద్దకు చేరుకున్నాయి. కుంభం, ప్రత్యేక పూజల తర్వాత అమ్మవార్ల ముసుగు తొలగించి భక్తులకు దర్శనం కల్పించారు. మంగళవాయిద్యాలు, బ్యాండు మేళాలు, సాంస్కృతిక కళాబృందాల ప్రదర్శనలు, యువత చిందుల నడుమ ఏడుగురు అమ్మవార్లు ఒకరి వెనుక ఒకరు.. వరుసగా సాగారు. పలువురు అమ్మవార్లకు కుంభం, కోడిపుంజులు, వేటలు సమర్పించారు. పెండ్లిమండపం నుంచి ఎక్కడి ప్రాంతాల అమ్మవార్లు అక్కడకు వెళ్లి కొలువుదీరారు. పట్టణమంతా ఏడుగంగమ్మలు కొలువుదీరిన ప్రాంతాల్లో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఎటు చూసినా భక్తజన సందడే కనిపించింది. పట్టణంలో ట్రాఫిక్‌ను మళ్లించారు. ఇక, పలువురు భక్తులు అమ్మవారికి అంబళ్లు పోశారు.

కన్నులపండువగా నిమజ్జనం

బుధవారం రాత్రి ఏడుగంగమ్మలు ఆయా ప్రాంతాల నుంచి తిరిగి ఊరేగింపుగా సాగారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ముత్యాలమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆనవాయితీ ప్రకారం అక్కడ ఒక్కో అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం నిమజ్జనం నిర్వహించారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.96 కోట్లు
మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,901
తలనీలాలు సమర్పించినవారు: 23,128

తిరుమలలో నటి శ్రియ



సినీనటి శ్రియ బుధవారం వేకువజామున తిరుమల శ్రీవారి సుప్రభాతసేవలో పాల్గొన్నారు. తన కుమార్తె రాధా కోస్చేవ్, తల్లి నీరజతో కలిసి ఆమె శ్రీవారి దర్శనం చేసుకున్నారు. ఇంకా కర్ణాటక మాజీ మంత్రి కెఎస్ ఈశ్వరప్ప, ఐపీఎస్ అధికారి విశాల్ గున్నీ కూడా బుధవారం దర్శనం చేసుకున్న వారిలో ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారికి విరాళంగా రెండు కార్లు



తిరుమల, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి బుధవారం రెండు కార్లు విరాళంగా అందాయి. తిరుపతికి చెందిన లోటస్ ఎలక్ట్రిక్ ఆటో వరల్డ్ ప్రైవేట్ లిమిడెట్ సంస్థ నుంచి అర్జున్ కొల్లికొండ అను భక్తుడు రూ.10 లక్షల విలువైన సిట్రాయెన్(ఈసీ3) ఎలక్ట్రిక్ కారును అందజేశారు. అలాగే చెన్నైకు చెందిన శరవనన్ కరుణాకరన్ అనే భక్తుడు రూ.9 లక్షల విలువైన సిట్రాయెన్ (బసాల్ట్ ఎక్స్ ప్లస్ యాంటీ) కారును విరాళంగా ఇచ్చారు. శ్రీవారి ఆలయం ముందు కార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తాళాలను శ్రీవారి ఆలయ పేష్కార్ రామకృష్ణకు అందజేశారు.

ఫిర్యాదుల్లో రెవెన్యూ సమస్యలే అధికం



తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల్లో అత్యధికంగా రెవెన్యూ సమస్యలపైనే ఉంటున్నాయని, వాటి పరిష్కారానికి భరోసా కల్పించాలంటూ రెవెన్యూ అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్ వేదికగా బుధవారం జిల్లాలోని అన్ని విభాగాల రెవెన్యూ, ల్యాండ్ అండ్ సర్వే అధికారులతో ఆయన సమీక్షించారు. 'రెవెన్యూ అధికారులంటేనే సమస్యల పరిష్కారంలో కాలయాపన చేస్తారని అపవాదు ఉంది. దీనిని తొలగించాలంటే ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి. వాటి పరిష్కారానికి కృషి చేయాలి. అప్పుడే వారికి మనపై, ప్రభుత్వంపై నమ్మకం కలుగుతుంది. కొంతమంది తహసీల్దార్లు, సర్వేయర్ల వ్యవహార శైలిపై ఫిర్యాదులు వస్తున్నాయి. ఇకనైనా వారు పద్ధతి మార్చుకోకుంటే కఠినమైన చర్యలు తీసుకుంటాం. సకాలంలో కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలి' అని కలెక్టర్ సూచించారు. రీసర్వే, 22ఏ, అసైన్‌మెంట్ ల్యాండ్స్, ఇనాం భూములు, పొజిషన్ సర్టిఫికెట్లు.. ఇలా పలు అంశాలపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోజ్మాండ్, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, జిల్లా ల్యాండ్ అండ్ సర్వే అధికారులు అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

నెల్లూరులో కలపాలంటూ గూడూరులో విద్యాసంస్థల బంద్

గూడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలంటూ బుధవారం విద్యార్థి, యువజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ చేపట్టారు. సాధుపేటసెంటర్ వద్ద రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ నాయకులు మాట్లాడుతూ గూడూరును తిరుపతి జిల్లాలో కలపడం వల్ల జిల్లా కేంద్రంలోని కార్యాలయాలకు వెళ్లాలంటే ప్రజలు, ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు, యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మనోజ్‌కుమార్, శశికుమార్, సునీల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు. ఇక, టవర్‌క్లాక్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు నాలుగో రోజూ కొనసాగాయి.

● శ్రీసిటీలో 'పేక్స్ ఇండియా'

నీటి నాణ్యత టెస్టింగ్ ల్యాబ్ ప్రారంభం


ల్యాబ్ ప్రారంభోత్సవం సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతున్న శ్రీసిటీ ఎండీ

సత్యవేడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని పల్ప్ అండ్ పేపర్, ఫుడ్ అండ్ బెవరేజెస్, పెట్రో కెమికల్ రంగాలకు అధునాతన రియాక్టర్ భాగాలను తయారు చేస్తున్న పేక్స్ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీ ఇండియా ప్రైవేటు లిమిటెడ్(పీఈటీఐ)సంస్థ తమ ఆవరణలో ఏర్పాటు చేసిన అత్యాధునిక నీటి, మురుగునీటి నాణ్యత టెస్టింగ్ ల్యాబ్‌ని బుధవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ.. శ్రీసిటీని క్లీన్ అండ్ గ్రీన్ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దే సంకల్పానికి ఇది మరో మైలురాయిగా అభివర్ణించారు. దీని ద్వారా పరిశ్రమలకు వేగవంతమైన, కచ్చితమైన, విశ్వసనీయ నీటి పరీక్ష సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. పేక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సుదీప్ సంగమేశ్వరన్ మాట్లాడుతూ, ఈ కొత్త ల్యాబ్ మేక్ ఇన్ ఇండియా ఆలోచనకు అనుగుణంగా అత్యాధునిక టెస్టింగ్ సేవలను అందిస్తుందన్నారు. శ్రీసిటీ పరిశ్రమలు, ఇతర సంస్థలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ ల్యాబ్ గురించి ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ (మాన్యుఫ్యాక్చరింగ్, అప్లికేషన్) గణేష్ చిదంబరం ల్యాబ్ గురించి వివరించారు. యూరోపియన్ ప్రమాణాలతో అభివృద్ధి చేసిన ల్యాబ్‌లో 30కిపైగా అంశాలలో నీరు, మురుగునీరుకు సంబంధించిన సర్టిఫైడ్ టెస్టింగ్ అందుబాటులో ఉందని తెలిపారు. ముఖ్యంగా ప్రత్యేక బయోకెమికల్ మీథేన్ పొటెన్షియల్(బీఎంపీ)టెస్టింగ్ ద్వారా పరిశ్రమలు బయోగ్యాస్ రికవరీ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చన్నారు.

● ఎస్వీయూ బీటెక్ సెకెండ్ సెమిస్టర్

ఫలితాలు ఎప్పుడు?

మూడు నెలలైనా వెల్లడికాని వైనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు ప్రకటించకపోవడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీటెక్ కోర్సు మొదటి సంవత్సరానికి సంబంధించిన రెండవ సెమిస్టర్ పరీక్షలు ఆగస్టులో నిర్వహించారు. వివిధ బ్రాంచ్‌లకు సంబంధించిన సుమారు 430 మంది విద్యార్థులు హాజరైనట్టు తెలుస్తోంది. పరీక్షలు పూర్తయి మూడు నెలలకు పైగా గడిచినా ఇంతవరకూ ఫలితాలు విడుదల చేయలేదు. ఇతర కాలేజీల్లో ఫలితాలు ప్రకటించేశారని ఇక్కడ మాత్రం ఎందుకు జాప్యం చేస్తున్నారని అంటున్నారు. కాగా ఆన్‌లైన్ ద్వారా జవాబు పత్రాల మూల్యాంకనం చేయడంతో ఆలస్యమవుతున్నట్టు సమాచారం. బీటెక్ నాలుగు, మూడవ సంవత్సరాలకు సంబంధించిన ఫలితాల విడుదలపై అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఉంది. ఎందుకంటే, బీటెక్ నాలుగు, మూడు సంవత్సరాలకు చెందిన విద్యార్థులు ఇతర ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల కోసం యూనివర్సిటీ వెలుపలకు వెళ్ళే అవకాశం ఉండడంతో నాలుగు, మూడో సంవత్సరం ఫలితాలను ముందుగా ఇస్తారని, ప్రాధాన్య క్రమంలో మిగతావి ఆలస్యం అవుతాయని అంటున్నారు. త్వరలోనే బీటెక్ సెకెండ్ సెమిస్టర్ ఫలితాలు ప్రకటిస్తామని యూనివర్శిటీ వర్గాలు చెబుతున్నాయి.

● ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ భూమినాథన్

తిరుపతి నుంచి ఇండిగో విమానాలన్నీ నడుస్తున్నాయి


వివరాలు వెల్లడిస్తున్న తిరుపతి ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ భూమినాథన్

రేణిగుంట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయం నుంచి ఇండిగో విమానాల రాకపోకలు పూర్తి స్థాయిలో పునరుద్ధరించినట్లు తిరుపతి ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ డి.భూమినాథన్ తెలిపారు. డిసెంబరు 7వ తేదీ నుంచి విమానాశ్రయ కార్యకలాపాలు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చినట్టు తెలిపారు. ప్రస్తుతం ఇండిగోకు చెందిన అన్ని విమానాలూ తిరుపతి నుంచి షెడ్యూల్ ప్రకారం నడుస్తున్నాయన్నారు. తిరుపతి విమానాశ్రయంలో బుధవారం ఆయన మీడియా సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. 5, 6 తేదీల్లో మాత్రం ఇండిగో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. డిసెంబరు 5న తిరుపతి విమానాశ్రయానికి రాకపోకలు సాగించాల్సిన 24 విమానాల్లో 18 రద్దుకాగా 6 విమానాలు ఆలస్యంగా నడిచాయన్నారు. అలాగే డిసెంబరు 6న 2 విమానాలు రద్దుకాగా 10 విమానాలు ఆలస్యంగా నడిచాయని వివరించారు. ఈ అంతరాయం కేవలం ఇండిగో విమానాలకు మాత్రమే పరిమితమైందని, ఇతర విమానయాన సంస్థల కార్యకలాపాలు సాధారణంగానే కొనసాగాయని చెప్పారు. అయితే ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) తిరుపతి విమానాశ్రయం, ఇండిగో ఎయిర్‌లైన్స్ సంయుక్త కార్యాచరణ ప్రణాళికతో పూర్తిస్థాయిలో సహాయక చర్యలు చేపట్టినట్టు భూమినాథన్ తెలిపారు. ప్రయాణికులకు ఆహారం, తాగునీరు, వసతి, విమాన ఛార్జీల పూర్తి రీఫండ్, క్యాబ్ సౌకర్యం, ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లు కల్పించినట్లు వివరించారు. ఈ మీడియా సమావేశంలో డీజీసీఏ డైరెక్టర్ దొరైరాజ్, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ అనురాగ్‌యాదవ్ పాల్గొన్నారు.

జనగణమన జాతీయ గీతం అయ్యింది గాంధీ వల్లే

● నెహ్రూపై ఆరోపణలు అన్యాయం: చింతా మోహన్

తిరుపతి(ఎంఆర్‌పల్లె), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): 'జనగణమన జాతీయ గీతంగా మారింది మహాత్మా గాంధీ సూచనతోనే. చరిత్ర తెలియని మోదీ ఏదేదో మాట్లాడుతున్నారు' అని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ విమర్శించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, '1911లో కోల్‌కత్తాలో జరిగిన కాంగ్రెస్ సదస్సులో రవీంద్రనాథ్‌ఠాగూర్ జనగణమన బెంగాలీ గీతాన్ని ఆలపించారు. అది విన్న గాంధీ, ఠాగూర్‌ను మదనపల్లెకు వెళ్లి అనిబిసెంట్‌ను కలవమని చెప్పారు. అలా ఆయన మదనపల్లెలో ఆ గీతాన్ని ఇంగ్లీషులోకి అనువదించారు. అక్కడే బాణీ సమకూర్చారు' అని ఆయన వివరించారు. ఇది తెలియని మోదీ నెహ్రూ మరణించి 60 ఏళ్లు అవుతుంటే, ఇప్పుడు ఆరోపణలు చేయడం అర్థరహితమన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించడం తగదని చింతా మోహన్ అన్నారు. టీటీడీ ప్రతిష్ట పెంచింది స్థానికులు, కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. అలాంటి టీటీడీ నేడు స్థానికులను చిన్నచూపు చూస్తోందన్నారు. ఇక బీజేపీ, టీడీపీకి బ్రేక్ దర్శనాల్లో కోటా ఇస్తున్నారంటూ తప్పుపట్టారు. 2004లో కాంగ్రెస్ చరిష్మాతో రాష్ట్రంలో గెలిచిందని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వల్ల కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ వల్ల పైకి వచ్చిన కుటుంబాల బిడ్డలు పార్టీకి నష్టం చేశారన్నారు. కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యార్లపల్లి గోపిగౌడ్, రవి, తేజోవతి, శాంతియాదవ్, మునిశోభ, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'టెట్'కు 92 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం జరిగిన టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)కు 92 మంది గైర్హాజరైనట్లు డీఈవో కుమార్ తెలిపారు. ఉదయం 7 కేంద్రాల్లో పరీక్షకు 714 మందికి 659 మంది.. మధ్యాహ్నం 3 పరీక్ష కేంద్రాల్లో 297కి 260 మంది పరీక్షలు రాశారన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించామని, బయోమెట్రిక్ హాజరు నమోదు చేశామని చెప్పారు.

ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రిమాండ్

తిరుపతి (నేరవిభాగం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు లక్ష్మణ్ కుమార్, శేఖర్‌రెడ్డికి బుధవారం రుయాస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం న్యాయమూర్తి ఎదుట పోలీసులు హాజరుపరచగా వారిని విచారించి ఈ నెల 23వ తేది వరకు రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చారు.


మంటలు చెలరేగిన కారు


పూర్తిగా దగ్ధమైన కారు

బయోట్రిమ్‌లో కారు దగ్ధం

మంగళం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం కరకంబాడిరోడ్డులోని బయోట్రిమ్‌లో బుధవారం పార్కింగ్ చేసి ఉన్న ఇన్నోవా కారు (కేఈ03 ఏఎం3699) ఇంజన్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. బయోట్రిమ్‌లో హార్టికల్చర్ సెమినార్‌కు వరదయ్యపాళెం నుంచి కొందరు రైతులువచ్చారు. వారి కారును పార్కు చేసి సెమినార్‌లో పాల్గొన్నారు. ఉదయం 11.30గంటలకు కారులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. బయోట్రిమ్ సిబ్బంది మంటలను ఆర్పడానికి ప్రయత్నించినా వీలు కాకపోవడంతో ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దాదాపు గంట పాటు శ్రమించి ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేశారు. అప్పటికే కారు కాలిపోయింది. అలిపిరి పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

అమ్మవారి ఆలయంలో వైద్యురాలి పట్ల అనుచిత ప్రవర్తన

● దేహశుద్ధి చేసిన భక్తులు

తిరుచానూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి దర్శనానికి బుధవారం సాయంత్రం బెంగళూరుకు చెందిన ఓ యువ వైద్యురాలు కుటుంబసభ్యులతో కలిసి వచ్చారు. ఆలయం లోపల క్యూలైనులో వెళ్తుండగా తెలంగాణ రాష్ట్రం ఖమ్మంకు చెందిన రమేష్.. ఆ వైద్యురాలిపై చేయివేసి అనుచితంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేయడంతో భక్తులు రమేష్‌ను క్యూలైను నుంచి వెలుపలకు లాక్కొచ్చి చితకబాదారు. అతడిని ఆలయ అధికారులు తిరుచానూరు పోలీసులకు అప్పగించారు. గతంలోనూ ఇతడు ఇదే తరహాలో ప్రవర్తించినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా విజిలెన్సు అధికారులు క్యూలైన్లలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.

పుత్తూరు వార్తలు

పుత్తూరులోనే వాహన ఫిట్‌నెస్ పరీక్షలు

● స్పందించిన రవాణామంత్రికి విజయ్‌బాబు కృతజ్ఞతలు

పుత్తూరు అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పుత్తూరు ఆర్టీఏ కార్యాలయంలోనే వాహన ఫిట్‌నెస్ పరీక్షలు కొనసాగించేలా రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్పందించడం పట్ల టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు. నాలుగు రోజులుగా వాహన ఫిట్‌నెస్ కోసం బంగారుపాళ్యంకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆటో, ట్రాక్టర్ వంటి చిన్నపాటి వాహనదారులకు ఫిట్‌నెస్ పరీక్షలు మోయలేని భారంగా మారిందన్నారు. ఈ క్రమంలో మంత్రికి విన్నవించిన వెంటనే ఆయన స్పందించడంతో వాహనదారుల్లో ఆనందం వెల్లివిరిసిందన్నారు.

మానవ హక్కుల దినోత్సవం



బాలికల జూనియర్ కళాశాలలో అవగాహన

పుత్తూరు, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్, బాలికల జూనియర్ కళాశాలల్లో మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు జరిగాయి. బాలికల జూనియర్ కళాశాలలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గాలి సురేష్ నాయుడు మాట్లాడుతూ... తమతో పాటు ఎదుటి వారి హక్కులకు భంగం కలగకుండా బాధ్యతగా ఉండాలని సూచించారు. పాలిటెక్నిక్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుమార్, శ్రీనివాసులు, కిషోర్‌కుమార్, సాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు.

సుప్రీం తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయాలి: ఎస్టీయూ

పుత్తూరు, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు విధిగా టెట్ రాయాలని సుప్రీంకోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ రాష్ట్ర ప్రభుత్వం వేయాలని కోరుతూ బుధవారం యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపింది. టెట్‌లో ఉత్తీర్ణులు కాకుంటే ఉద్యోగం నుంచి తొలగిస్తారని నాయకులు వాపోయారు. రివ్యూ పిటిషన్ వేయడంలో జాప్యం జరుగుతుండడంతో తమలో ఆందోళన పెరుగుతోందని తెలిపారు.

గ్రామీణ రోడ్లతోనే పంచాయతీల అభివృద్ధి



సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

వడమాలపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో రోడ్ల నిర్మాణాలు చేపడితేనే పంచాయతీల్లో అభివృద్ధి సాధ్యపడుతుందని తెలుగు యువత నగరి నియోజకవర్గ అధ్యక్షుడు ఉదయ్ యాదవ్ చెప్పారు. లక్ష్మమ్మకండ్రిగ పంచాయతీలోని ఎస్టీకాలనీలో రూ.27 లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జట్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు, ఎంపీడీవో శేషగిరిరావు, మునికృష్ణ పాల్గొన్నారు.

సమస్యలను అధిగమిస్తేనే అభివృద్ధి

వడమాలపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సమస్యలను అధిగమిస్తేనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని డీఆర్‌డీఏ పీడీ టి. శోభన్ బాబు అన్నారు. బుధవారం వడమాలపేట వెలుగు కార్యాలయంలో ఆదర్శ గ్రామాల ఏర్పాటుపై జరుగుతున్న శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. మొదటి రోజు శిక్షణను సమీక్షించి అనంతరం సభ్యుల విజయాలు, వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. డీపీఎం వెంకటేశులు, ఏపీఎం చంద్రబాబు, సీసీలు ప్రకాష్, జయ, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

హర్షవర్ధన్ సాహసం అభినందనీయం



పుత్తూరు టౌన్, డిసెంబర్ 10(ఆంధ్రజ్యోతి): కంటి చూపు లేకపోయినా పట్టుదల, కృషితో స్కేటింగ్‌లో ప్రపంచ స్థాయి విజయాన్ని సాధించిన గేటు పుత్తూరుకు చెందిన దివ్యాంగ బాలుడు మురారి హర్షవర్ధన్ సాహసం అందిరికీ స్ఫూర్తిదాయకమని జాతీయ కాపు సంఘ ప్రచార కార్యదర్శి గోపీరాయల్ పేర్కొన్నారు. బుధవారం హర్షవర్ధన్‌ను ఘనంగా సన్మానించారు. హర్షవర్ధన్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనాయుడు, కృష్ణయ్య, సత్య, డిల్లీబాబు పాల్గొన్నారు.

డిజిటల్ చెల్లింపులపై అవగాహన



స్పెషల్ క్యాంపుకు వెళ్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

నారాయణవనం, డిసెంబర్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు బ్రాహ్మణతాంగేల్ లో డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ... గత మూడు రోజులుగా బ్రాహ్మణతాంగేల్‌లో వలంటీర్లు కుటుంబ సర్వే, జీవనశైలి, ఆరోగ్యంపై వివరాలను తెలుసుకున్నారని చెప్పారు. ఆరోగ్యం, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పించామన్నారు ప్రిన్సిపాళ్లు జనార్దన రాజు, రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

డప్పు కళాకారులను ఆదుకోవాలి

శ్రీకాళహస్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): డప్పు కళాకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంక్రాంతి వెంకటయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని పుచ్చపల్లి సుందరయ్యభవనంలో బుధవారం డప్పు కళాకారుల సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ప్రతి కళాకారుడి కుటుంబానికి గుర్తింపుకార్డులో పాటు రెండెకరాల సాగు భూమిని పంపిణీ చేయాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో 60 శాతం రాయితీ, ఆరోగ్యబీమా సౌకర్యాలు కల్పించాలని, కలెక్టర్ గ్రౌండింగ్‌నిధుల ద్వారా డప్పు పరికరాలు కొనుగోలు చేసి ఇవ్వాలని కోరారు. మండలానికో డప్పు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య, నాయకులు అరుణాచలం, సురేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

రేపు చిల్లకూరులో ప్రజాదర్బార్

గూడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండల కార్యాలయంలో ఈనెల 12వ తేదీన ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేయాలని కోరారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

డక్కిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందిన ఘటన డక్కిలి మండలం లింగసముద్రం హరిజనవాడ వద్ద బుధవారం రాత్రి జరిగింది. లింగసముద్రం హరిజనవాడకు చెందిన వెంకట్రామయ్య(60) రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం నడుపుతున్న యువకుడు శివకు గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముఖ్యమంత్రి హామీ నెరవేర్చేవరకు పోరాటం



టవర్‌క్లాక్‌సెంటర్ వద్ద రిలే దీక్షలో జేఏసీ నాయకులు

గూడూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నెరవేర్చే వరకు జేఏసీ ఆధ్వర్యంలో శాంతియుతంగా పోరాటం సాగిస్తామని జేఏసీ కన్వీనర్ దశరధరామిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నాలుగో రోజు రిలే దీక్ష నిర్వహించారు. బహుజన ఐక్యవేదిక నాయకులు మద్దతు ప్రకటించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ మాట్లాడుతూ గూడూరు ప్రజల మనోభావాలను పరిగణలోకి తీసుకుని నెల్లూరు జిల్లాలో కలపాలన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారని, దానిని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బహుజన ఐక్యవేదిక, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచకాలతోనే భూ సమస్యలు: కురుగొండ్ల



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

డక్కిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతల అరాచకాల వల్లే గ్రామాల్లో భూ సమస్యలు పెరిగిపోయాయని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం డక్కిలి మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో భూముల రీ సర్వే గందరగోళంగా చేపట్టారని, రెవెన్యూ రికార్డులను సైతం తారుమారు చేసి వైసీపీ నేతలు భూ దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. ఫలితంగా భూ తగాదాలను పరిష్కరించుకోలేక రైతులు రోజూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుట్టు చప్పుడు కాకుండా కేసులు మాఫీ చేసుకొంటున్నారని వెంకటగిరి వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమారెడ్డి చేసిన విమర్శలు ఆయన తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు నాయుడు రాజకీయాల్లో కడిగ ముత్యం అని అభివర్ణించారు. దేశంలో ఏ నాయకుడిపై లేనన్ని కేసులు జగన్‌పై ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం గురుకుల క్రీడా మైదానంలో ఉపాధ్యాయులకు క్రీడా పోటీలను ఎమ్మెల్యే ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోను రాజశేఖర్, వైస్‌ఎంపీపీ గడ్డం చంద్రశేఖరరెడ్డి, ఎంపీడీవో రవీంద్రబాబు, ఐసీడీఎస్ అధికారిణి షంషాద్ బేగం, ఎంఈవోలు జగదీష్ బాబు, వెంకటేశ్వర్లు, వ్యవసాయశాఖ అధికారిణి శిరీషా, వెంకటగిరి ఎస్ఐ ఏడుకొండలు, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, లింగసముద్రం సొసైటీ అధ్యక్షుడు రంగినేని రాజా, రాష్ట్ర బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పరుచూరి పెంచల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని సైకిల్‌యాత్ర



సైకిల్‌యాత్రలో మీ-సేవ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు

గూడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ మీ-సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మీ-సేవ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్‌యాత్ర బుధవారం గూడూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇ-సేవ కేంద్రాలను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి తమను తొలగించిందని చెప్పారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మీ-సేవ కేంద్రాల్లో 18 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న 605 మంది ఉపాధి కోల్పోయారని తెలిపారు. ఈ విషయాన్ని యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్‌కు వివరించగా, అధికారంలోకి వచ్చాక న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి నుంచి అమరావతికి సైకిల్‌యాత్ర చేపట్టామన్నారు.

గూడూరును నెల్లూరులో కలపాలని నిరసన



విద్యానగర్ గాంధీబొమ్మ సెంటర్‌లో అఖిలపక్ష నాయకుల నిరసన

కోట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ విద్యానగర్ గాంధీబొమ్మ సెంటర్ వద్ద బుధవారం ఎంవీరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అఖిల పక్ష నాయకులు నిరసన తెలిపారు. గూడూరును తిరుపతి జిల్లాలో కలపడం వల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌కు వెళ్లాలన్నా అవస్థలు పడుతున్నారన్నారు. నెల్లూరు జిల్లాతో గూడూరుకు ఎంతో అనుబంధం ఉందని, నియోజకవర్గ ప్రజల మనోభావాలను, అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలని కోరారు. తిరుపతి వద్దు... నెల్లూరు ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీరావు ఫౌండేషన్ ప్రతినిధి లీలామోహన్ కృష్ణ, బీజేపీ సీనియర్ నాయకులు సారంగం రమేష్‌బాబు, విజయలక్ష్మి, ఆవుల సుబ్బయ్య, టీడీపీ నాయకులు బాబురావు, ధనంజయ, సుబ్రహ్మణ్యం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సూళ్లూరుపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జీజే రాజశేఖర్ మాట్లాడుతూ 2010కి ముందు డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులందరూ టెట్‌లో ఉత్తీర్ణత సాధించాలని, లేకపోతే ఉద్యోగం వదులుకోవాల్సి వస్తుందని చెప్పడం అన్యాయమన్నారు. 30 సంవత్సరాల సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు టెట్ అర్హత సాధించాలనడం సరికాదన్నారు. అనంతరం తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ ప్రవీణ్, టీడీపీ నాయకులు రఫీ, నెలవల రాజేష్

నాయుడుపేట టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో నివాసం ఉంటున్న బాలాజీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి కుటుంబానికి 786 సేవాసంఘం తరపున రూ.50వేల నగదు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, టీడీపీ నాయకులు రఫీ, నెలవల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి



ఏవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

సూళ్లూరుపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో నకిలీ విత్తనాలతో మోసపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సీపీఐ నాయకుడు మోదుగుల పార్థసారథి మాట్లాడుతూ రైతులకు మేలురకం విత్తనాలని నమ్మించి నకిలీ విక్రయించి వందలాది మంది రైతులను మోసం చేసిన దుకాణ యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్ర మండలాల్లో దాదాపు 1500 ఎకరాల్లో వరి విత్తనాలు నాటిన 20రోజులకే వెన్ను తీయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయరన్నారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేసి, నకిలీ విత్తనాలు విక్రయించిన దుకాణ యజమాని, సరఫరా చేసిన కంపెనీపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఏవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సుధాకరక్ రెడ్డి, నాగేంద్ర, శ్రీనివాసులు, కుమార్, ఆనంద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

150 మందికి కంటివైద్య పరీక్షలు

వాకాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాకాడులోని ముస్లిం వీధిలో ఉన్న మోడల్ ప్రాథమిక పాఠశాలలో ఎంవీరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రమేష్ ఐకేర్ ఆస్పత్రి నేతృత్వంలో 150 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంవీరావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలామోహన్‌కృష్ణ, కార్యదర్శి విజయలక్ష్మి ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్, రమేష్ ఐకేర్ సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంవీరావు ఫౌండేషన్ ప్రతినిధులు

108 సిబ్బందికి రెయిన్ కోట్ల పంపిణీ

గూడూరు అర్బన్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీక్లబ్ ఆధ్వర్యంలో 108 అంబులెన్స్ వాహనంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. రోటరీ భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో కార్యక్రమంలో వెంకటేశ్వర్లురెడ్డి, మల్లు విజయ్ కుమార్‌రెడ్డి, మునిగిరీష్, మయూరి శ్యామ్‌యాదవ్, దశరధరామిరెడ్డి, జీజీనాయడు, హరిప్రసాద్, రామ్‌ప్రసాద్, కిరణ్‌కుమార్, సునీల్, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్లు

సూళ్లూరుపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తంగేడు దిబ్బ, కారిజాత గిరిజన సెంటర్‌లోని గిరిజనులకు జనసేన నాయకులు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలాంజనేస్వామి ఆలయ పాలకమండలి అధ్యక్షుడు వాకచర్ల రమేష్, బీజేపీ నాయకురాలు బెజవాడ విజయమ్మ, జనసేన నాయకులు ఆవుల రమణ, హరిబాబు, కోటి, దాసు, శంఖు సురేష్, సూరి పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాలు

చిల్లకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పగుంటపాళెం గ్రామంలో పేదలకు బుధవారం రాజనేని రామా నాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు, కూరగాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామా నాయుడు, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సురేంద్రరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు



పోలీస్‌స్టేషన్‌లో వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

వెంకటగిరి టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి పోలీస్‌స్టేషన్‌ను గూడూరు డీఎస్పీ గీతాకుమారి బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా పట్టుబడ్డ ద్విచక్ర వాహనాలను పరిశీలించి ఎస్ఐ గోపీని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలు పట్ల ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని అనుసరించాలని సూచించారు.

లైన్ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

గూడూరు అర్బన్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల పదవీ విరమణ చేసిన మహేశ్వరయ్యను ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్-1104 ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో నరేంద్రరెడ్డి, పరంధామయ్య, అనిల్‌కుమార్, ప్రసాద్, చిన్నయ్య, శ్రీనివాసులు, శ్రీధర్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ సరికాదు

నాయుడుపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీ కరణ సరికాదని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. బుధవారం నాయుడుపేట పట్టణంలో వైసీపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

వెంకటగిరి టౌన్: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకంగా వెంకటగిరి నియోజకవర్గంలో 72వేల సంతకాలు సేకరించామని వైసీపీ సమయన్వకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రవాప్తంగా సేకరించిన కోటి సంతకాలను త్వరలోనే మాజీ సీఎం జగన్ ఆధ్వర్యంలో గవర్నర్‌కు అందజేస్తామని చెప్పారు.

గూడూరు: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నియోజకవర్గంలో 70 వేల సంతకాలను సేకరించామని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. ఆ ప్రతులను బుధవారం తిరుపతికి తీసుకెళ్లారు.

చీడపీడల నివారణపై దృష్టి పెట్టండి



కొక్కుపాడులో రైతులకు సూచనలిస్తున్న ఏవో సుచేంద్ర ప్రసాద్

కోట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చీడపీడల నివారణపై దృష్టి పెట్టాలని మండల వ్యవసాయ అధికారి సుచేంద్ర ప్రసాద్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొక్కుపాడు, వంజివాక గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో కలిసి వరిపైర్లను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో వ్యవసాయ అధికారులు రచ్చబండ సమావేశాలు నిర్వహించారు. వాతావరణ మార్పుల కారణంగా మంచు విపరీతంగా కురుస్తోందని, దీని వల్ల వరిపైర్లకు చీడపీడలు సోకే ప్రమాదం ఉందన్నారు. పొట్ట, చిరుపొట్టదశలో ఉండే వరిపైరుకు ఎక్కువగా వైరస్ సోకే అవకాశం ఉందని, రైతులు ఎప్పటికప్పుడు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి సాయికుమార్, సహాయ వ్యవసాయ అధికారులు, రైతులు ఉన్నారు.

బూత్‌స్థాయిలో టీడీపీ నాయకుల పర్యటన



వరదయ్యపాళెం మండల పరిశీలనలో పూరీమిట్ల కుమారి

వరదయ్యపాళెం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు పర్యటించి వారి సమస్యలు, ప్రభుత్వం పాలనపై అభిప్రాయాలను సేకరించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ ఆదేశాల మేరకు సత్యవేడు నియోజకవర్గ పార్టీ ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి, ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారి మండలంలోని విటయపాళెం-52, వరదయ్యపాళెం-61, సీఎల్ఎన్ పల్లి-44, కాంబాకం-67 పాండూరు-71 బూత్‌ల పరిధిలో పర్యటించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పి.యుగంధర్‌రెడ్డి, సత్యవేడు నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు సాధుయి తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

గూడూరు అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది అరవ పార్వతయ్య అన్నారు. బుధవారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో స్వేచ్ఛగా జీవించేలా రాజ్యాంగం పలు హక్కులను కల్పించిందని, వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

సత్యవేడు - టీపీకోట రోడ్డుకు మహర్దశ

ఎమ్మెల్యే చేతుల మీదుగా నేడు భూమిపూజ ● రూ. 4 కోట్లతో పనులు


అధ్వానంగా ఉన్న టీపీకోట రోడ్డు

సత్యవేడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు - టీపీకోట రోడ్డుకు మహర్దశ పట్టనుంది. గత ఐదేళ్లుగా గుంతల రోడ్డుతో అవస్థలు పడుతున్న నాగలాపురం, సత్యవేడు మండలాల ప్రజలకు ఎట్టకేలకు ఆ కష్టాలు తీరనున్నాయి. రోడ్డు అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 4కోట్లను విడుదల చేసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మండలంలో జరిగిన విచ్చలవిడి గ్రావెల్, ఇసుక అక్రమ రవాణా ధాటికి రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. అప్పట్లో నిత్యం వందలాది టిప్పర్ల రాకపోకలతో రోడ్డు ఛిద్రమై ప్రజలు, విద్యార్థులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో సత్యవేడు - ఊత్తుకోట్టై రోడ్డుకు రూ.5 కోట్లు, వీఆర్‌కండ్రిగ - టీపీకోట రోడ్డుకు రూ.4 కోట్లు, అల్లప్పగుంట - కన్నావరం క్రాస్ రోడ్డుకు రూ.2.50 కోట్లను రాష్ట్రప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో ఊత్తుకోట, అల్లప్పగుంట రోడ్డు పనులు ప్రారంభం కాగా వీఆర్‌కండ్రిగ - టీపీకోట రోడ్డు పనులకు ఇటీవలే టెండర్లు పూర్తయ్యాయి. పనులను నెల్లూరుకు చెందిన పీటీఆర్ సంస్థ దక్కించుకుంది. ఎమ్మెల్యే ఆదిమూలం చేతుల మీదుగా గురువారం పనులకు భూమిపూజ చేయనున్నారు. అదే విధంగా నాగలాపురం - చిన్నపాండూరు వరకు 28 కి.మీ. మేర రోడ్డు అభివృద్ధికి రూ.11 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు కూడా ఎమ్మెల్యే భూమిపూజ చేయనున్నారు.

ముక్కంటి సేవలో సినీనటి శ్రియ



శ్రీకాళహస్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని బుధవారం సినీ నటి శ్రియ దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆమెకు ముక్కంటి పాలకమండలి సభ్యురాలు కోలా విశాలాక్షి, అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి ముక్కంటి జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఏర్పేడు ఎంపీపీగా పూజారి ఆదిలక్ష్మి?

ఏర్పేడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు ఎంపీపీగా పంగూరు ఎంపీటీసీ సభ్యురాలు పూజారి ఆదిలక్ష్మి ఎంపికకానున్నారు. ఏర్పేడు ఎంపీపీగా ఉన్న పల్లం ఎంపీటీసీ సభ్యురాలు గీత రాజీనామాతో వైస్‌ఎంపీపీగా ఉన్న శ్రీనివాసులుయాదవ్‌ను జిల్లా అధికారుల ఆదేశాలతో ఎంపీపీగా ఎన్ను కున్నారు. అయితే ఏర్పేడు ఎంపీపీ స్థానం ఎస్టీ మహిళకు కేటాయించడంతో ఎమ్మెల్యే సుధీర్ సూచనల మేరక జిల్లా అధికారులు పంగూరు ఎంపీటీసీ సభ్యురాలిగా ఉన్న ఆదిలక్ష్మిని ఎంపీపీగా నియమించనున్నారు. ఈమేరకు గురువారం ఆమెను అధికారికంగా ఎంపిక చేసి జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో సౌభాగ్యం ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేయించనున్నట్లు తెలుస్తోంది.

నేడు సత్యవేడు వైస్ ఎంపీపీ ఎన్నిక

సత్యవేడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండల వైస్ ఎంపీపీ ఎన్నికను గురువారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ పేర్కొన్నారు. సత్యవేడు వైస్‌ఎంపీపీగా ఉండిన మదనంబేడు ఎంపీటీసీ సభ్యురాలు సరోజిని అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి ఆ పదవి ఖాళీ గా ఉంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలతో ఎంపీడీవో ఆధ్వర్యంలో గురువారం వైస్‌ఎంపీపీని ఎన్నుకోనున్నారు. మండలంలో 14 మంది ఎంపీటీసీ సభ్యులుండగా సరోజిని మృతితో ప్రస్తుతం 13 మంది ఉన్నారు. కాగా పుదుకుప్పం ఎంపీటీసీ సభ్యుడు శరవణ పేరు తెర మీదకొచ్చింది. ఆయన ఎన్నిక లాంఛనమే అని ప్రచారం నడుస్తోంది.

మానవ హక్కులపై అవగాహన


ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న జడ్జి కృష్ణప్రియ

శ్రీకాళహస్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): హ్యూమన్ రైట్స్ డే సందర్భంగా 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ బుధవారం సబ్‌జైల్‌ను సందదర్శించి ఖైదీలకు మానవ హక్కులపై అవగాహన కల్పించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సబ్‌జైల్‌ను ఖైదీలు పునరావాసకేంద్రంగా తెలుసుకోవాలని, ఏదైనా సమస్య ఉంటే అర్జీల రూపంలో ఇవ్వాలన్నారు. న్యాయ సలహాల కోసం నెం.15100ను సంప్రదించాలని కోరారు. అంతకు ముందు కోర్టు నుంచి న్యాయవాదులు, కక్షిదారులు చట్టం గురించి తెలుసుకోవాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, సబ్ జైలు సిబ్బంది, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న ఆదిమూలం

నారాయణవనం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గత నెలలో మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన మండలంలోని చేనేత కార్మికులకు నిత్యావసర సరుకులను బుధవారం ఎమ్మెల్యే ఆదిమూలం పంపిణీ చేశారు. పాలమంగళంలో నిర్వహించిన పంపిణీలో ఆయన మాట్లాడుతూ మొంథా తుపాను కారణంగా చేనేత రంగం తీవ్రంగా దెబ్బతిన్నదన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన సీఎం చంద్రబాబు బాధి తులను ఆదుకోవడానికి నిత్యావసర సరుకు లను పంపిణీ చేసి వారికి భరోసా కల్పించారని తెలిపారు. జడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న శంకర్‌రెడ్డి తదితరులు

వరదయ్యపాళెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కువ్వా కొల్లిలో పంచాయతీ భవన నిర్మాణానికి నాయకులు, గ్రామ పెద్దలతో కలసి సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి భూమి పూజ నిర్వహించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంది స్తామన్నారు. యుగంధర్‌రెడ్డి, పవన్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ నంద కిషోర్‌రెడ్డి, మస్తాన్, శివ, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సేకరిస్తున్న భూములు

అటవీ శాఖవి కాదని రిపోర్టు ఇవ్వండి


తిరుపతి డీఎఫ్‌వోకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

ఏర్పేడు, డిసెంబరు 10(ఆంధ్ర జ్యోతి): మండలం గుడిమల్లం మీదుగా వడమాలపేట మండలం పూడి వరకు కొత్త రైలు మార్గాన్ని నిర్మించనున్న విషయం విదితమే. ఈ రైల్వే ట్రాక్ ఏర్పాటుకు గుడిమల్లం వద్ద 23మంది రైతుల నుంచి 18 ఎకరరాలను అధికారులు సేకరించనున్నారు. ఈ రైతులు గత 30 ఏళ్లగా ఆ భూములను సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుతం రెవెన్యూ రికార్డుల్లో రైతుల పేరిట అనుభవం ఉంది. 30 ఏళ్లగా ఆ భూములకు రైతులు ప్రభుత్వానికి కట్టిన శిస్తు రసీదులు ఉన్నాయి. గుడిమల్లం వద్ద సాగుచేస్తున్న 23మంది రైతులు పొలాలు, పాత రెవెన్యూ రికార్డుల్లో అటవీ భూములుగా పొందుపరచి ఉంది. ఆ భూములు అటవీభూములు కాదని రెవెన్యూ అధికారులకు డీఎఫ్‌వో అధికారికంగా ధృవపత్రం ఇవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో రైతులు సాగు చేస్తున్న భూములు అటవీభూములు కాదని అధికారికంగా ధృవపత్రం ఇవ్వాలని గుడిమల్లం రైతులు బుధవారం తిరుపతి జిల్లా అటవీశాఖ అధికారిని కలిసి వినతిపత్రం అందించారు. స్పందించిన ఆయన ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు.

సమస్యలు అధిగమిస్తే సర్వతోముఖాభివృద్ధి

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల్లో సమస్యలను అధిగమిస్తే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని ఏపీఎం మునెయ్య చెప్పారు. వెలుగు కార్యాలయంలో ఆదర్శ గ్రామాల ఏర్పాటుపై శిక్షణ కార్యక్రమంలో 25 సంవత్సరాల్లో సంఘాలు సాధించిన విజయాలపై చర్చించారు. సీసీలు తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన జాతర సంబరం




అమ్మవారి వాహనం ముందు అతివల వేషధారణ - అమ్మవారికి కుంభం వేస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో ఏడుగంగమ్మల జాతర సంబరంగా జరిగింది. ఆదివారం చాటింపుతో గంగమ్మల జాతరకు శ్రీకారం పలికిన విషయం తెలిసిందే. ఎక్కడా లేనివిధంగా ఒకేరోజు ఏడు గంగమ్మలకు ఏకకాలంలో జాతర నిర్వహించడం శ్రీకాళహస్తిలో మాత్రమే విశేషం అన్న విషయం విదితమే. మంగళవారం నుంచే పట్టణవ్యాప్తంగా జాతర సందడి నెలకొంది. విద్యుత్ దీపాలంకరణతో శోభిల్లింది. మంగళవారం రాత్రి ఏడు ప్రాంతాలనుంచి ఆయా ప్రాంత నిర్వాహకులు అమ్మవార్లను ఏడు గంగమ్మల ఆలయం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ కుంభం సమర్పణతో బుధవారం వేకువజామున మూడు గంటలకు అమ్మవార్లకు ముసుగు తొలగించి జాతర ఊరేగింపు ఆరంభమైంది. భక్తులు ఒకేసారి ఏడుగంగమ్మలను దర్శించుకునేందుకు ముత్యాలమ్మగుడివీధికి చేరుకున్నారు. అడుగడుగునా కొబ్బరికాయలు, కర్పూరా హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పెండ్లిమండపం వద్ద నుంచి ఆయా గంగమ్మలు తమ ప్రాంతాలకు చేరుకుని కొలువుదీరారు. రాత్రి 8గంటల వరకు భక్తులు అమ్మవార్లను వేర్వేరుగా దర్శించుకున్నారు. అనంతరం రాత్రి మళ్లీ గంగమ్మల అమ్మవార్లు ముత్యాలమ్మ ఆలయం వద్దకు వేర్వేరుగా వరుస క్రమంలో చేరుకుని నిమజ్జనంతో జాతరకు ముగింపు పలికారు. జాతరలో డ్రమ్స్ వాయిద్యాలు ఉర్రూత లూగించాయి. పిల్లలు, పెద్దలు, యువత అమ్మవారి జాతర ఊరేగింపులో ఉత్సాహంగా చిందులు వేశారు.

● ఏడుగంగమ్మల జాతర సందర్భంగా అమ్మవార్లను బుధవారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ముక్కంటి ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు దర్శించుకున్నారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. అంతకు ముందు ఏడుగంగమ్మల అమ్మవారికి సారె అందజేశారు. అమ్మవార్ల ఆశీస్సులు శ్రీకాళహస్తి ప్రజలపై ఎల్లపుడు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. పగడాల రాజు, సిరాజ్‌బాషా, బుల్లెట్ జయశ్యామ్‌రాయల్, శ్రీవారి సురేష్, పులి రామచంద్ర, రమేష్‌శ్రీను, మునికృష్ణారెడ్డి, పాలమంగళం రవి తదితరులు పాల్గొన్నారు.


అమ్మవార్లను ఆహ్వానిస్తున్న మహిళలు





సినీ యాక్టర్ల డూప్‌లు - అమ్మవారి సేవలో బియ్యపు మధుసూదన్‌రెడ్డి, అంజూరు శ్రీనివాసులు తదితరులు

ప్రతి మహిళా ఆర్థికవేత్తగా ఎదగాలి


పిచ్చాటూరు సమావేశంలో మాట్లాడుతున్న శోభన్‌బాబు

నారాయణవనం, డిసెంబర్ 10(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా సంఘం ద్వారా ప్రభుత్వం అందించే రుణాలను ఆస్థులుగా సమకూర్చుకోవడంతో పాటు కుటుంబంలో ఆర్థికవేత్తగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు పేర్కొన్నారు. బుధవారం నారాయణవనం మండల మహిళా సమాఖ్య కార్యలయంలో గ్రామ మహిళా సంఘ అధ్య క్షుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళా సంఘం నుండి సంస్థల వరకు దూరదృష్టితో కృషి చేయాలని సూచించారు. డీపీఎం వెంకటేష్, ఏపీఎం లు ధనంజయరెడ్డి, చంద్రబాబు, స్త్రీ నిధి మేనేజర్ అదిల్ భాషా, సీసీలు రాజేశ్వరి, నాగేంద్రరావు, అరుణకుమార్, నిమ్మి తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల అభివృద్ధి, ఆర్థిక పరిపుష్టితో ఆ కుటుంబంతో పాటు ఆయా గ్రామాల పురోగతికి తోడ్పడుతుందని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తెలిపారు. బుధవారం కార్యాలయంలో ఎంసీఎల్‌ఎఫ్, సీఐఎఫ్ స్థాయిలో విజన్ బిల్డింగ్ ట్రైనింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమూహాలు ఆత్మ నిర్భరత సాధించే దశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సంఘాల నిర్వహణ ఆర్థిక లావాదేవీలు పారదర్శకత, ఫండ్ వినియోగం, భవిష్యత్ ప్రణాళికలు క్లస్టర్ లెవెల్ ఫంక్షన్స్‌పై వివరించారు. కార్యక్రమంలో ఐబీ ఏపీఎం రాధమ్మ, డీపీఎం వెంకటేష్, ఏపీఎంలు చంద్రకళ, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కొడుకుపై కత్తితో దాడి


చికిత్స పొందుతున్న రాజా

శ్రీకాళహస్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కొడుకుపై తండ్రి కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన తొట్టంబేడు మండలం పూడి ఎస్సీకాలనీలో బుధవారం రాత్రి జరిగింది. కాలనీకి చెందిన చెంగల్రాయులు, ఆయన కుమారుడు రాజా కూలీ పనులు చేస్తుంటారు. ఇద్దరి మధ్య గత కొంతకాలంగా కు టుంబ కలహాలున్నాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇంటి వద్ద ఇద్దరు మద్యం తాగి గొడవ పడ్డారు. ఆగ్రహించిన తండ్రి కొడుకుపై కత్తితో దాడిచేయడంతో ఎడమచేతికి తీవ్ర గాయమైంది. కుటుంబసభ్యులు రాజాను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం రుయాకు తరలించారు. తొట్టంబేడు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపడుతున్న వెంకటేష్

శ్రీకాళహస్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి రూరల్ ఎస్‌ఐగా వెంకటేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పిచ్చాటూరు నుంచి శ్రీకాళహస్తికి ఆయన బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడే పనిచేశారు. తనకు గ్రామీణ ప్రాంతాలపై అవగాహన ఉండటంతో అసాంఘిక కార్యక్రమాలకు తావు లేకుండా చర్యలు చేపడుతాని స్పష్టం చేశారు. శాంతిభద్రతల విషయంలో ప్రజలు సహకరించాలని చెప్పారు. అనుమానిత వ్యక్తుల సంచారం సమాచారం ఇవ్వాలని కోరారు.

'కౌశల్'లో వరుణ్‌రెడ్డి మొదటి స్థానం


వరుణ్‌రెడ్డిని అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయ బృందం

వరదయ్యపాళెం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కౌశల్ ప్రతిభాన్వేషణ జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో వరదయ్యపాళెం జడ్పీ హైస్కూలు విద్యార్థి వరుణ్‌రెడ్డి మొదటి స్థానంలో నిలిచారు. ఈక్రమంలో తిరుపతిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కుమార్ చేతుల మీదుగా వరుణ్‌రెడ్డి ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థిని బుధవారం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రమణయ్య ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ పోటీల్లో గైడ్ మాస్టర్‌గా సుబ్బరామయ్య వ్యవహరించారు. ఈ విద్యార్థి వరుణ్‌రెడ్డి ఈ నెల 27వ తేదీ తిరుపతి సంస్కృత విశ్వ విద్యాలయంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారు.

టీడీపీ కార్యాలయ నిర్మాణానికి స్థలాన్వేషణ


తెలుగు గంగ కాలువ వద్ద స్థల పరిశీలనలో శంకర్‌రెడ్డి తదితరులు

సత్యవేడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తెలుగుదేశం కార్యాలయం ఏర్పాటుకు సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి స్థలాన్వేషణ చేశారు. ఇప్పటి వరకు నియోజకవర్గ కేంద్రంలో పార్టీ కార్యాలయం లేకపోవడంతో నాయకులు, కార్యకర్తలకు వెలితిగా ఉండేది. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేయాలన్న పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాలతో శంకర్‌రెడ్డి బుధవారం అనువైన స్థలం కోసం పలు ప్రాంతాలను పరిశీలించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పరమశివం, చంద్రశేఖర్‌రెడ్డి, శివకుమార్, చిన్న, షణ్ముగం, కృష్ణయ్య యాదవ్, శివయ్యశెట్టి, వాసు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ఏర్పేడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వికృతమాల వద్ద రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన నీలాద్రి అపార్ట్‌మెంట్స్‌లో బుధవారం టీడీపీ నాయకులు తాగునీటి సమస్యను పరిష్కరించారు. నీలాద్రిలో రెండు రోజుల కింద మోటారు మరమ్మతులకు గురైంది. తెలుగు యువత మండల అధ్యక్షుడు పూల హేమాక్షిరాయల్ ఆధ్వర్యంలో మోటారుకు మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరించారు.

రైతులకు చేయూత

పిచ్చాటూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ వివిధ రుణాల ద్వారా రైతులకు చేయూతనందిస్తుందని చీఫ్ మేనేజర్ ఎం.దేవప్రసాద్ పేర్కొన్నారు. జాతీయ రైతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం బ్యాంకులో రైతులకు అందించే రుణాలపై అవగాహన సమావేశం జరిగింది. డ్రిప్, రెయిన్‌గన్, స్ప్రింకర్లు, పాల ఉత్పత్తి, డెయిరీ వంటి రకరకాల రుణాలు తన బ్యాంకు అందిస్తుందన్నారు. పిచ్చాటూరు బ్రాంచి మేనేజర్ బి.అంజాద్ అలీ మాట్లాడుతూ రైతులు ఎస్‌బీఐ ద్వారా వివిధ రుణాలు పొందడానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఎస్‌బీఐ లైఫ్ మేనేజర్ రాజేష్‌కుమార్, ఆర్‌బీవో మేనేజర్ ఎం.హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి



పిచ్చాటూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలం కీళపూడి బైపాస్‌లో బుధవారం సాయంత్రం ఎస్‌ఐ బి.రాఘవేంద్ర ఆధ్వర్యంలో హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారికి సూచనలు, సలహాలు ఇచ్చారు. లైసెన్స్, హెల్మెట్ లేకుండా బండి నడిపితే చట్టాల్ని ఉల్లంఘించినట్లేనని చెప్పారు.